
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 16-8-2024 15/-

# వక్ఫ్ బిల్లు







## బంగ్లా ముక్తి బాహినీ మొదలుకుని షేఖ్ హసీనా ఉద్వాసన వరకు



## సృష్టికర్త ఎవరు?

సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 33 హైదరాబాద్
శుక్రవారం 16 ఆగస్టు 2024 రూ.15-00
11 సఫర్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

## తండ్రి ప్రసన్నతలోనే దైవ ప్రసన్నత ఉంది.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





## అత్యాశ

## లోపల...


| | | |
|---|---|---|
| మీడియా వైఫల్యం కాదా? | ...... | 04 |
| వక్ఫ్ బిల్లు | ...... | 05 |
| దేవుని బెబ్బులి!! – 42 | ...... | 09 |
| బంగ్లా ముక్తి బాహినీ మొదలుకుని షేఖ్ హసీనా ఉద్వాసన వరకు | ...... | 12 |
| రెక్కలు తెగిన బాల్యం....? | ...... | 14 |
| సమస్త ప్రాణులకు నీరే ఆధారం | ...... | 16 |
| అరుదైన పత్రికా రచయిత, కవి దేవిప్రియ | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| భారతీయ సమాజంలో సత్య సందేశం – 2 | ...... | 20 |
| వృద్ధాప్యం కూడా ఒక వరమే | ...... | 23 |
| అల్లాహ్ అత్యద్భుత బహుమతి అమ్మపాలు | ...... | 24 |
| ఇస్లాంపై డాకిన్స్ అపార్థాలు – వాస్తవాలు | ...... | 29 |
| సృష్టికర్త ఎవరు? | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |


**ఝుండా ఊంచా రహే**



ఊరూరా ఎగిరింది
మువ్వన్నెల జెండా
దేశభక్తి ఉప్పొంగగ
జనాల మదినిండా!
కాపాడుకోవాలోయ్
రూపం చెడకుండా
రాజ్యాంగమె రక్షణ
అదేనోయండ దండ !!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## మీడియా వైఫల్యం కాదా?

బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభంలో పౌరసమాజ నాయకుడు ముహమ్మద్ యూనుస్‌ను సంక్షోభపరిష్కర్తగా ఆహ్వానించడం దక్షిణాసియాలో ఆహ్వానించదగిన పరిణామం. బంగ్లాదేశ్ రాజ్యవ్యవస్థ, బంగ్లా సైన్యం, పాలకవర్గాలకు ముహమ్మద్ యూనుస్ వంటి పౌరసమాజ నాయకుడు, నోబెల్ గ్రహీతను ఆశ్రయించడం తప్ప మరో మార్గం కూడా మిగల్లేదు. ఏ దేశంలో అయినా గాని ప్రభుత్వం ప్రజామద్దతును కోల్పోతే అక్కడ విశ్వసనీయతను పునరుద్ధరించగలిగేది పౌర సమాజమే.

బంగ్లా ప్రధాని అక్కడి నుంచి ఇండియా వచ్చి శరణు కోర డంతో ఆమె పరిపాలన ముగిసింది. బంగ్లాదేశ్‌లో ఏం జరుగుతుందో భారత ప్రభుత్వం తెలుసుకోలేకపోయిందా? ఇంటిలిజెన్స్ వైఫల్యాలున్నాయా? ఎందువల్ల ఎన్డీయే కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే జూన్‌లో షేక్ హసీనాను భారతదేశానికి ఆహ్వానించడం జరిగింది? నిజానికి మోడీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారానికి కూడా ఆమె వచ్చారు. ఆ వెంటనే మరోసారి వచ్చారు. ప్రతిపక్షాలు ప్రభుత్వానికి పూర్తి మద్దతిచ్చి ఈ విషయంలో నిలబడ్డాయి. కాని అనేక ప్రశ్నలకు ప్రభుత్వం కూడా జవాబు చెప్పుకోవలసి ఉంది. ఇది కేవలం ఇంటిలిజెన్స్ వైఫల్యం మాత్రమేనా లేక మీడియా వైఫల్యం కూడా లేదా? నిజానికి ఇది విదేశీ వ్యవహారాల గురించి విశ్లేషణలు రాసే మేధావుల వైఫల్యం కూడా కాదా?

దేశంలో పెద్ద మీడియా సంస్థలకు పొరుగుదేశాల్లో ప్రతినిధులే లేరు. కాబట్టి మన పొరుగు దేశాల్లో ఏం జరుగుతుందో భారత ప్రజలకు తెలియాలంటే భారత విదేశాంగ శాఖ చెప్పే మాటలు లేదా పాశ్చాత్య మీడియాలో వచ్చే వార్తలే ఆధారం. మన మీడియా చెప్పేది ఏదీ లేదు. పొరుగు దేశాల్లో ఏదైనా జరిగితే మన చానళ్ళు రిటైరైన దౌత్యవేత్తలను, రిటైరైన దౌత్యాధికారులను పిలిచి పంచాయతీ వంటి చర్చలు నిర్వ హించడం తప్ప గ్రౌండ్ రిపోర్టింగ్ చేసింది లేదు. మన పొరుగు దేశాల్లో మన పాత్రికేయులు ఎవరైనా ఉన్నారా?

కాబూల్ నుంచి 2021లో అమెరికా దళాలు హఠాత్తుగా నిష్క్రమించినప్పుడు అక్కడ మన జర్నలిస్టులు ఎవరు లేరు. 2022లో వేలాది మంది విద్యార్థులు యువత కొలంబోలో అధ్యక్ష భవనంపై దాడి చేసినప్పుడు కూడా పాశ్చాత్య మీడియా నుంచి మాత్రమే మనకు వార్తలు వచ్చాయి. మనవాళ్ళెవరు ఎక్కడా లేరు. మాల్దీవుల్లో భారత సైన్యాన్ని ఉపసంహరించాలన్న వార్త వచ్చినప్పుడు కూడా మన మీడియా సంస్థలకు అక్కడ జరుగుతున్నదేంటో తెలుసుకునే ప్రతినిధులెవ్వరు అక్కడలేరు. ఇప్పుడు బంగ్లాదేశ్ విషయం లోను మనకు వార్తలు పాశ్చాత్య మీడియా నుంచే రావాలి.

మన మీడియా ప్రతినిధులు అక్కడ ఉండడమన్నది ఇలాంటి సంక్షోభ సమయాల్లో రిపోర్టింగ్ చేయడానికి మాత్రమే కాదు, రోజువారి పొరుగు దేశాల్లో ప్రజల జీవితం, అక్కడి వ్యవహారాల గురించి మనకు వార్తలు అందిస్తూ ఉండడం కూడా అవసరం. ఆ పని ఎన్నడూ జరగలేదు. ఈ రిపోర్టింగ్ జరుగుతు ఉన్నట్లయితే క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో అంచనాలకు అవకాశం ఉంటుంది. ఇంటిలిజెన్స్ వైఫల్యం గురించి మాట్లాడేవాళ్ళు ఈ మీడియా వైఫల్యం గురించి కూడా చెప్పాలి.

బంగ్లాదేశ్ ప్రధానిగా షేక్ హసీనా గత నెల ఇండియా సందర్శించినప్పుడు బంగ్లాదేశ్ ప్రజల్లో ఆమె పట్ల పెరుగు తున్న నిరసన, ఆమె నిరంకుశ పద్ధతులు, ముసురుకుంటున్న సంక్షోభం గురించి మాట్లాడినవారు ఒక్కరు లేరు.

అబ్దుల్ వాహెద్

# వక్ఫ్ బిల్లు




**సచార్ కమిటీ నివేదిక** దేశంలో ముస్లిములు అత్యంత వెనుకబడి ఉన్నారని స్పష్టం చేసింది. వెనుకబడిన వర్గాల కన్నా ముస్లిములు అధికంగా వెనుకబాటుకు గురై ఉన్నారని వివరించింది. సచర్ కమిటీ చేసిన సూచనల్లో కీలకమైన ఒక సూచన ఏమిటంటే, వక్ఫ్ ఆస్తులను ముస్లిముల ప్రగతి వికాసాల కోసం ఉపయోగించి ఫలితాలు సాధించవచ్చని చెప్పడం. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ముస్లిముల వక్ఫ్ ఆస్తులనే నిరాకరించే గొప్ప పనికి పూను కుంటోంది. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే బీజేపీ నినాదం నిజరూపమేమిటో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మోడీగారు చెప్పిన మంగళసూత్రం, బర్రెల వ్యాఖ్యలతో తేటతెల్లమయ్యింది. ఇప్పుడు దీనికి కొనసాగింపే ఈ వక్ఫ్ చట్టం సవరణ బిల్లు.

ప్రభుత్వం వక్ఫ్ చట్టం 1995ను సవరిస్తూ యునిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫీషియన్సీ అండ్ డెవలప్ మెంట్ యాక్ట్ 2023 బిల్లును ప్రవేశపెట్టడానికి పూనుకుం టోంది. ఇందులో ప్రధానమైన విషయం వక్ఫ్ బోర్డుకు ఉన్న అధికారాలకు కోత పెట్టడం. ఒక స్థిరాస్తి వక్ఫ్ ఆస్తి అవునా కాదా అన్నది నిర్ణయించే అధికారం వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం వక్ఫ్ బోర్డుకు ఉంది. ఈ సెక్షన్ ఇప్పుడు తొలగి స్తామని అంటున్నారు. అంటే ఒక ఆస్తి వక్ఫ్ ఆస్తి అవునా కాదా అన్నది నిర్ణయించే అధికారం ఇప్పుడు వక్ఫ్ బోర్డుకు ఉండదు. అంతేకాదు, కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిములతో పాటు ముస్లిమేతరులకు కూడా ప్రాతినిథ్యం కల్పిస్తామంటు న్నారు.

ఈ బిల్లు ప్రస్తుతం ఉన్న వక్ఫ్ చట్టానికి 40 సవరణలు ప్రతి పాదిస్తోంది.

వక్ఫ్ చట్టం సవరణ బిల్లు కూడా పౌరసత్వ సవరణ చట్టం వంటిదే అంటే తప్పులేదు. నిజానికి ఈ బిల్లు వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం 1947లో వక్ఫ్ ఆస్తులుగా నిర్ధారించబడిన వాటన్నింటిని మళ్ళీ చర్చకు పెట్టి వక్ఫ్ ఆస్తులపై వేటు వేయడం. వక్ఫ్ చట్టానికి సవరణ ఎందుకు అవసరమయ్యిందన్నదిన కాస్త లోతుగా ఆలోచించవలసిన విషయం. బాబరీ మస్జిద్ వివాదం ఇప్పుడు బీజేపీకి రాజకీయంగా ఓట్లు రాబట్టే ఆయుధంగా మిగల్లేదు. అందువల్ల వారణాసిలో మస్జిదు, మధురలో ఈద్గా, మధ్యప్రదేశ్‌లో కమల్ మౌలా మస్జిదు వగైరాలపై కొత్త వివాదా లను రాజేస్తున్నారు. కాని ఈ స్థలాలు వక్ఫ్ ఆస్తులుగా ఉండడం వల్ల న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ఇబ్బందులను పరిష్కరించడానికి ఉద్దేశించినవే ఈ సవర ణలు. వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించబడినవి వక్ఫ్ ఆస్తులు కాదని

చెప్పాలంటే ఇప్పుడు ఈ కొత్త చట్టం అవసరమే మరి.

వక్ఫ్ అంటే ధార్మిక సేవా కార్యక్రమాల కోసం ఎవరైనా దానమిచ్చిన ఆస్తులు. దానమివ్వడం అంటే తన ప్రయివేటు ఆస్తిని ఒక వ్యక్తి ధార్మిక కార్యక్రమాల కోసం అంటే మస్జిదు నిర్మాణం కోసం లేదా, ముస్లిం ఖబ్రస్తాన్ కోసం లేదా ముస్లిముల ధార్మిక ఆచరణల కోసం అలాగే సేవా కార్యక్రమాల కోసం అంటే వితంతువుల పెన్షన్లు, పిల్లల చదువులు మొదలైన వాటికి ఆర్థిక సహాయం అందించడానికి దానమిచ్చిన ఆస్తులు. కాబట్టి ఇవి ప్రభుత్వ ఆస్తులు కావు, ప్రయివేటు ఆస్తులన్నది ముందుగా అర్థం చేసుకోవాలి. వక్ఫ్ ఆస్తులను అమ్మడం కాని కొనడం కాని చేయలేరు. అయితే దురాక్రమణల సమస్య సాధారణంగా స్థిరాస్తుల వ్యవహారంలో ఎలా ఉందో అలాగే వక్ఫ్ ఆస్తుల విషయంలోను దురాక్రమణల సమస్య ఉంది. ఈ సమస్యను పరిష్కరించి వక్ఫ్ ఆస్తుల నిర్వహణను పటిష్టపరిస్తే, వక్ఫ్ వల్ల వచ్చే ఆదాయమే ముస్లిముల ప్రగతి వికాసాలకు అవసరమైన చర్యలు చేపట్టడానికి సరిపోతుంది. ఇదే విషయాన్ని సచర్ కమిటి చెప్పింది. కాని ఇప్పుడు వక్ఫ్ ఆస్తులనే కబళించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ముస్లిములకు చెందిన ఆస్తులను కైవసం చేసుకోడానికే ఈ బిల్లు తీసుకువచ్చారని సాధారణ ముస్లిములు భావిస్తున్నారు.

దేశంలో గురుద్వారా చట్టం 1925 ఉంది. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ ఆస్తులను కూడా వ్యవస్థీకరించి ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించాలని చాలా కాలంగా ముస్లిములు కోరుతున్నారు. కాని ఇప్పుడు ప్రభుత్వం మరింత నియంత్రణ తన చేతుల్లోకి తీసుకోవాలని పూనుకుంది.

దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులు అపారంగా ఉన్నాయి. ఈ ఆస్తులను సరిగా ఉపయోగిస్తే ముస్లిముల సంక్షేమానికి, ప్రగతి వికాసాలకు ఈ ఆదాయమే సరిపోతుంది. కాని గురుద్వారా ప్రబంధక్ కమిటి వంటిది ముస్లిముల విషయంలో కూడా ఏర్పాటు చేస్తే పంజాబులో గురుద్వారా ప్రబంధక్ కమిటీ తర్వాత రాజకీయంగా బలపడినట్లే ముస్లిముల ఈ సంస్థ కూడా రాజకీయంగా బలం పుంజుకుంటుందనే భయాలు కూడా ప్రభుత్వ వర్గాల్లో ఉన్నాయి. వక్ఫ్ బోర్డును ఈ విధంగా వ్యవస్థీకరిస్తే దేశవ్యాప్తంగా ముస్లిములందరు ఒకే గుర్తింపు క్రింద సమైక్యమయ్యే అవకాశం ఉంది. అందువల్ల ముస్లిముల్లో చీలికలు తీసుకురావాలంటే బొహ్రా తదితర సముదాయాలకు ప్రత్యేక వక్ఫ్ బోర్డులనే కొత్త ప్రతిపాదన అవసరమని ప్రభుత్వం భావించింది.

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వక్ఫ్ ఆస్తులు ఆయా రాష్ట్రాల వక్ఫ్ బోర్డుల పేర రిజిష్టరై ఉన్నాయి. మస్జిదులు, ఖబ్రస్తాన్‌లు, దర్గాలు, ఖాన్‌ఖాలు, స్కూళ్ళు, అనాధ శరణాలయాలు, ఈద్గాలు వగైరా ఇందులో ఉన్నాయి. దేశంలోని వక్ఫ్ ఆస్తుల ఆదాయాన్ని సద్వినియోగం చేస్తే చాలు ముస్లిములకు సంక్షేమ పథకాల అవసరమే ఉండదు. ప్రభుత్వమిచ్చే స్కాలర్‌షిప్పులు, హజ్ సబ్సిడీల అవసరమే ఉండదు. ముస్లిముల ఆర్థిక సమస్యలన్నింటిని వక్ఫ్ ఆస్తుల ఆదాయంతో పరిష్కరించవచ్చు. కాని ప్రభుత్వాలు అలా జరగనివ్వలేదు. మరోవైపు దురాక్రమించుకున్న శక్తులు వక్ఫ్ ఆస్తుల ఆదాయాన్ని పేద ముస్లిములకు అందనివ్వలేదు. అనేక వక్ఫ్ ఆస్తులు దురాక్రమణలకు గురయ్యాయి. అనేక ఆస్తులు కోర్టు వివాదాల్లో ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించే బదులు బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సమస్యలను మరింత సంక్లిష్టం చేయాలనుకుంటోంది.

దేశంలోని మతస్వేచ్ఛకు ఈ బిల్లు విరుద్ధమైనదిగా మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. వక్ఫ్ బోర్డు అధికారాలకు కత్తెర పెట్టి ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకోవాలనుకుంటోంది.

ఇంతకు ముందు మనం చెప్పుకున్నట్లు వక్ఫ్ ఆస్తులు నిజానికి ప్రయివేటు వ్యక్తులు, లేదా గత కాలంలో రాజులు దానమిచ్చిన ఆస్తులు. ఏ పని కోసం వక్ఫ్‌గా ఆస్తులను ఇవ్వడం జరిగిందో ఆ పని కోసమే వాటిని ఉపయోగించాలి. మదరసా కోసం ఇచ్చిన ఆస్తిని మదరసా కోసమే ఉపయోగించాలి. ఇవి ప్రయివేటు ఆస్తులే కాని ప్రభుత్వ ఆస్తులు కావు. మస్జిదు కోసం ఇచ్చిన వక్ఫ్ భూమిలో మస్జిదు నిర్మాణంతో పాటు, ఇళ్ళు, దుకాణాలు కట్టడం వల్ల వాటి కిరాయి నుంచి ఆదాయం లభిస్తుంది. ఈ ఆదాయం మస్జిదు నిర్వహణ ఖర్చులకు ఉపయోగిస్తారు. వితంతువులకు, అనాధపిల్లలకు సహాయమందించడానికి కూడా వక్ఫ్ ఆస్తులున్నాయి. వక్ఫ్ ఆస్తి నిర్వహణ బాధ్యతలు చూసే మేనేజరును ముతవల్లీ అంటారు. ఈ ముతవల్లీల విషయంలో విమర్శలు, ఆరోపణలు కూడా వచ్చాయి. ఆ తర్వాత ఈ ముతవల్లీల పనితీరును పర్యవేక్షించే ఒక సంస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచన రావడంతో 1995లో వక్ఫ్ చట్టం రూపంలో ఇది అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డులు ఏర్పడ్డాయి. వక్ఫ్ బోర్డు చేసే పని ఈ పర్యవేక్షణ చూడడం.

గమనించవలసిన విషయమేమిటంటే, ఒక వ్యక్తి తన ఆస్తిని మస్జిదు నిర్మించాలని వక్ఫ్ చేశాడు. అంటే దానమిచ్చాడు. ఆ ఆస్తిలో మస్జిదు నిర్మాణం జరిగి, దాని నిర్వహణకు ఒక ముతవల్లీ ఏర్పాటవుతారు. అలాగే మరో వ్యక్తి తన ఆస్తిని అనాథ పిల్లల సంరక్షణకు దానమిచ్చాడు. అక్కడ అనాథ శరణాలయం కట్టి దాని నిర్వహణకు ఒక ముతవల్లీ ఏర్పాటవుతాడు. అయితే ఈ నిర్వహణ బాధ్యతల విషయంలో వక్ఫ్ బోర్డుకు ప్రత్యక్ష ప్రమేయమేమీ ఉండదు. ఎందుకంటే వక్ఫ్ బోర్డు ధార్మిక సంస్థ ఏమీ కాదు. అది చట్టబద్ధంగా పర్యవేక్షణకు ఏర్పడిన సంస్థ మాత్రమే. వక్ఫ్ ఆస్తికి ముతవల్లీ మాత్రమే ధార్మిక ప్రాతినిధ్యం వహిస్తాడు. ఆ వక్ఫ్ ఆస్తి దురాక్రమణకు గురైనా, లేదా దురుప యోగమవుతున్నా అప్పుడు వక్ఫ్ బోర్డు ఈ విషయంలో కల్పించుకుంటుంది. ప్రత్యేక వక్ఫ్ ఆస్తి నిర్వహణ వ్యవహారాలన్నీ ముతవల్లీ, మేనేజింగ్ కమిటీల ద్వారానే జరుగుతాయి.

ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమిటంటే, ఒక వ్యక్తి చాలా సంవత్సరాల క్రితం తన ఆస్తిని ప్రత్యేక లక్ష్యంతో అంటే పిల్లల చదువు కోసం వక్ఫ్ చేశాడు. కాని ఆ వక్ఫ్ ఆస్తికి ముతవల్లీగా నియమించబడిన వ్యక్తి ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించలేదు. అప్పుడు పరిస్థితేమిటి? ఇలాంటి సంఘటన ఏదన్నా వక్ఫ్ బోర్డు దృష్టికి వస్తే, అవసరమైన విచారణ తర్వాత వక్ఫ్ బోర్డు ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే అధికారాలున్నాయి. అయితే వక్ఫ్ బోర్డు ఏ ఆస్తినైనా వక్ఫ్ ఆస్తిగా ప్రకటించడం ఏకపక్షంగా కూడా జరగదు. సాక్ష్యాధారాలు చూపించవలసి ఉంటుంది. సుప్రీంకోర్టు ఫిబ్రవరి 2022 తీర్పులో కూడా ఈ విషయం స్పష్టంగా ఉంది. వక్ఫ్ బోర్డు నిర్ణయంపై కోర్టుకు వెళ్ళి అప్పీలు చేసుకోవచ్చు. వక్ఫ్ చట్టం ప్రకారం వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించబడినవి సంబంధిత రాష్ట్ర వక్ఫ్ బోర్డు పేర రిజిష్టరవుతాయి. వక్ఫ్ బోర్డు పేరుతో రిజిష్టరైనంత మాత్రాన ఈ ఆస్తికి యాజమాన్య హక్కు వక్ఫ్ బోర్డుకు ఉండదు. కేవలం పర్యవేక్షణ అధికారాలు మాత్రమే ఉంటాయి. నిర్వహణ బాధ్యతలు ముతవల్లీ, మేనేజింగ్ కమిటీలకు ఉంటాయి. ఎవరికి కూడా క్రయవిక్రయాల హక్కు ఉండదు. వక్ఫ్ బోర్డు చేసే పని ఏమిటంటే వక్ఫ్ ఆస్తి ఏ పని కోసం వక్ఫ్ చేయబడిందో ఆ పనికి మాత్రమే ఉపయోగపడేలా చూడడం, దురుపయోగాలు, దుర్వినియోగాలు, దురాక్రమణలు జరగకుండా చూడడం. క్లుప్తంగా చెప్పాలంటే వక్ఫ్ ఆస్తి ప్రభుత్వ ఆస్తి కాదు, వక్ఫ్ బోర్డుకు క్రయవిక్రయాల హక్కులతో సహా యాజమాన్య హక్కులేవీ లేవు.

కాబట్టి వక్ఫ్ ఆస్తులు ఇచ్చింది ముస్లిములే. ఇవి వారి ఆస్తులే. వక్ఫ్ ఆస్తుల్లో రెండు రకాలున్నట్లు మనం గమనించవచ్చు. ముస్లిములు దానమిచ్చిన ఆస్తులుగా స్పష్టమైన దస్తావేజులు ఉన్న ఆస్తులు. అంటే వక్ఫ్ నామా ఉన్న ఆస్తులు. ఇవి మొదటి రకం. రెండవ రకం ఏమిటంటే, స్పష్టమైన దస్తావేజులు లేకపోయినా సుదీర్ఘకాలంగా ప్రత్యేక కార్యక్రమాల కోసం ఉపయోగపడుతూ వచ్చిన ఆస్తులు. ఉదాహరణకు ఏదన్నా ప్రదేశం వందేళ్ళకు మించి ఖబ్రస్తాన్‌గా ఉపయోగపడుతూ వస్తూంటే దాన్ని వక్ఫ్ ఆస్తిగానే పరిగణించడం జరుగుతుంది. అలాగే ఏదన్నా మస్జిదులో శతాబ్దాలుగా నమాజులు జరుగుతుంటే ఆ మస్జిదు స్థలానికి సంబంధించి వక్ఫ్ పత్రాలు లేకపోయినా అది కూడా వక్ఫ్‌గా పరిగణించబడుతుంది. ఈ రెండవరకానికి సంబంధించి వివాదముంది. గమనించవలసిన విషయమేమిటంటే, ప్రస్తుతమున్న వక్ఫ్ చట్టం ప్రకారం కూడా రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల సర్వే ప్రభుత్వం నియమించే సర్వేయర్ మాత్రమే చేస్తారు. ఆ ఆస్తి విషయంలో ఏవైనా అభ్యంతరాలు వస్తే వాటిని కూడా రికార్డు చేసి రాష్ట్రప్రభుత్వానికి నివేదిక పంపుతారు. ఆ నివేదికను ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు పంపిస్తుంది. వక్ఫ్ బోర్డు తన జవాబు ఇస్తుంది. ఇలా ఈ ప్రక్రియ ముగిసి వక్ఫ్ ఆస్తిగా నిర్ధారణ జరిగిన తర్వాతనే గెజిట్‌లో వస్తుంది.

వక్ఫ్ ఆస్తుల క్రయవిక్రయాలు జరిగే అవకాశం లేదని చెప్పుకున్నాం. కాని చాలా సందర్భాల్లో వక్ఫ్ ఆస్తుల దురాక్రమణల గురించిన వార్తలు కూడా వస్తుంటాయి. విషయమేమిటంటే, ఏ స్థిరాస్తికి సంబంధించైనా తగాదాలు రావడం జరుగుతుంది. ప్రయివేటు ఆస్తులైనా, ప్రభుత్వ ఆస్థులైనా ఇలాంటి వివాదాలు వస్తుంటాయి. దురాక్రమణలు స్థిరాస్తుల విషయంలో జరగడం, వివాదాలు తలెత్తడం ఇతర స్థిరాస్తుల విషయంలో ఎలా జరుగుతుందో వక్ఫ్ ఆస్థుల విషయంలో కూడా అలాగే జరుగుతుంది. వక్ఫ్ ఆస్తికి ఉన్న ఒక రక్షణ ఏమిటంటే, వక్ఫ్ ఆస్తి క్రయవిక్రయాలు చట్టవిరుద్ధం కాబట్టి వక్ఫ్ బోర్డు ఆ ఆస్తిపై తన హక్కును తిరిగి పొందే ప్రయత్నాలు చేయడానికి సానుకూలత ఉంది. ఏదన్నా స్థిరాస్తి ఎవరి అధీనంలోనైనా పన్నెండు సంవత్సరాలు, లేదా ముప్పయి సంవత్సరాలుగా ఉంటే సాధారణంగా ఆ ఆస్తిపై అతనికి యాజమాన్య హక్కులు లభించే అవకాశం ఉంటుంది. కాని వక్ఫ్ ఆస్తి విషయంలో ఇది వర్తించదు. ఉదాహరణకు ఏదైనా ఆస్తి ఒక వ్యక్తి అధీనంలో ఉంది. యాభై సంవత్సరాలకు పైబడి అతను ఆ ఆస్తిని అనుభవిస్తున్నాడు లేదా మరొకరికి అమ్మేశాడు. ఆ ఆస్థి వక్ఫ్ ఆస్తి అని దస్తావేజులు వక్ఫ్ బోర్డు వద్ద ఉంటే, వక్ఫ్ బోర్డు ఆ ఆస్థిని తిరిగి రాబట్టుకునే ప్రయత్నాలు చేయవచ్చు.

సుప్రీంకోర్టు న్యాయవాది వజీహ్ షఫీక్ ఈ వివాదాలకు సంబంధించి ఒక సంఘటనను అశోక్ పాండే ఇంటర్వ్యూలో చెప్పారు. ఢిల్లీలో వక్ఫ్ బోర్డు చాలా కాలం క్రితం ఒక వక్ఫ్ ఆస్తిని అద్దెకు ఇచ్చింది. అద్దెకు వున్న వ్యక్తి సుదీర్ఘకాలం అందులో నివసించాడు. అతను మరణించిన తర్వాత పిల్లలకు ఆ ఆస్తి వక్ఫ్ ఆస్థి అని తెలియదు. అందువల్ల వాళ్ళు దానిని పంచుకున్నారు. ఆ ఆస్తిని బిల్డరుకు అమ్మేశారు. బిల్డర్ అక్కడ ఫ్లాటులు కట్టి అమ్మేశాడు. చాలా మంది లోన్లు తీసుకుని ఆ ఫ్లాటులు కొనుక్కున్నారు. కాని, ఇలాంటి వ్యవహారం ముందుకు వస్తే వక్ఫ్ బోర్డు ఆ ఆస్తిని తిరిగి రాబట్టుకోడానికి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు. ఫ్లాటులు కొన్నవారు తమ డబ్బులు మునిగిపోయాయని, మోసపోయామని బాధపడవచ్చు. కాని ఆ ఆస్థి వక్ఫ్ ఆస్థి అనే వాస్తవాన్ని కాదనలేరు. బాధితులు వక్ఫ్ బోర్డు తమ ఆస్థులను దురాక్రమించేస్తుందని ఆరోపించవచ్చు, కాని వాస్తవం అది కాదు. ఆ ఆస్తి స్వతహాగా వక్ఫ్ ఆస్తి కాబట్టే వక్ఫ్ బోర్డు తన క్లెయిమ్ చేస్తుంది. ఇక్కడ మరో విషయమేమిటంటే, వక్ఫ్ బోర్డులకు తమ ఆస్తులను నిర్వహించుకోవడమే సరిగా చేతకావడం లేదు. అద్దెకిచ్చిన ఆస్తులను మరిచిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. అలాంటి వక్ఫ్ బోర్డులు పనిగట్టుకుని వక్ఫ్ ఆస్తుల పేరు చెప్పి దురాక్రమణలు చేయడం అనేది ఊహకు కూడా అందని విషయం. ఇంకో విషయమేమిటంటే, ఏదన్నా వక్ఫ్ ఆస్తిని వక్ఫ్ బోర్డు వక్ఫ్ ఆస్తిగా ప్రకటించినా వక్ఫ్ బోర్డుకు లభించే హక్కులేమిటి? ఆ ఆస్తిని అమ్మడం కుదరదు. ఆ ఆస్తి ఏ పనికి ఉద్దేశించి వక్ఫ్ చేయబడిందో ఆ పనికి ఉపయోగించడం తప్ప మరో పనిచేయడం కూడా కుదరదు. కాబట్టి వక్ఫ్ బోర్డులు అన్యాయంగా దురాక్రమణలు చేస్తున్నాయని చెప్పే మాటల్లో బలం లేదు.

వక్ఫ్ బోర్డుల విషయంలో మహిళలకు ప్రాతినిధ్యం లేదని చెప్పడం కూడా వాస్తవం కాదు. వక్ఫ్ చట్టం ప్రకారం కనీసం ఇద్దరు మహిళలు బోర్డులో ఉండాలి. అలా ఉంటున్నారు కూడా.

గత పదేళ్ళుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి హఠాత్తుగా ఇప్పుడు వక్ఫ్ చట్టంలో మార్పు చేయాలనే ఆలోచన ఎందుకు వచ్చింది? వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు, వక్ఫ్ బోర్డును మరింత పటిష్టం చేయడానికి బీజేపీ ప్రభుత్వం ఇంతవరకు ఎప్పుడైనా ఆలోచించిందా? ఇలాంటి అనేక ప్రశ్నలు కూడా ఈ సందర్భంగా మన ముందుకు వస్తున్నాయి.

దేశంలో ఉన్న వక్ఫ్ బోర్డులు ముస్లిం సమాజానికి సేవలందించడానికి ఏర్పడ్డాయి. దేశంలో చాలా ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగా ఉన్నాయి. అయినా దేశంలో ముస్లిముల పరిస్థితి దళితుల కన్నా దయనీయంగా ఉందని సచర్ కమిటీ వంటి నివేదికలు చెబుతున్నాయి.

వక్ఫ్ భావన ఇస్లాం ప్రారంభకాలం నుంచి ఉంది. ప్రపంచంలోని ప్రాచీన ఇస్లామీయ విశ్వవిద్యాలయాలు కైరోలోని అల్ అజ్హర్, మొరక్కోలోని అల్ ఖురాయినైన్ విశ్వవిద్యాలయం వక్ఫ్ ఆస్తులతోనే ఏర్పడ్డాయి. భారతదేశంలో ఢిల్లీ సుల్తానుల కాలం నుంచి వక్ఫ్ చేయడం కనిపిస్తుంది. 1954లో జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు వక్ఫ్ చట్టం వచ్చింది. 1964లో కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ ఏర్పాటయ్యింది. 1995లో ఈ చట్టానికి సవరణలు చేశారు. ఈ సవరణ ప్రకారం రాష్ట్రాల్లో వక్ఫ్ బోర్డులు ఏర్పడ్డాయి. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ సలహాసంస్థగా ఉంటుంది. వక్ఫ్ ఆస్తుల వివాదాలు వక్ఫ్ ట్రిబ్యునల్ పరిష్కరిస్తుంది. ఇందులో ప్రభుత్వ అధికారితో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారు. వాళ్ళు ముస్లిములు కావలసిన అవసరం కూడా లేదు. షియా వక్ఫ్ బోర్డులు ప్రత్యేకంగా ఉన్నాయి. కాని వక్ఫ్ బోర్డులు ఆస్తులను నిర్వహించడంలో జరిగిన అవకతవకలు అనేకం ముందుకు వచ్చాయి. ఆస్తులు దురాక్రమణలకు గురయ్యాయి. ఫలితం పేద ముస్లిములకు అందవలసిన సేవలు అందడం లేదు. అవినీతి పెరిగి పోయింది. వక్ఫ్ ఆస్తుల వల్ల కొందరు మాత్రమే ప్రయోజనాలు పొందుతున్నారని, సగటు ముస్లిములకు, పేద ముస్లిములకు దానివల్ల వితంతు పించన్లు, అనాథ పిల్లలకు నామ మాత్ర సహాయాలు తప్ప మరేమీ లభించడం లేదన్న విమర్శ కూడా ఉంది.

వక్ఫ్ బోర్డులు సక్రమంగా తమ విధులు నిర్వర్తించి ఉంటే నేడు పరిస్థితి ఇలా ఉండేది కాదు మరోవైపు అదను చూసి ఈ వక్ఫ్ ఆస్తులను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు మొదలయ్యాయి.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




ఎస్.ఎమ్. మలిక్

## హిజ్రత్, ఆ పైన

అటు దైవాదేశం ప్రకారం, ప్రవక్త మహనీయులు(స) మదీనాకు హిజ్రత్ చేసి వలస వెళ్ళిపోవాలని ఏర్పాట్లు కట్టుదిట్టం చేసుకున్నారు. ఏ రాత్రి వైరులు ఆయన హత్యకు పూనుకుని ఆయన (స) ఇంటిని చుట్టుముట్టారో ఆనాడు మహనీయ అలీకి ప్రవక్తశ్రీ (స) పడుకునే పడక పైన పరుండే బాధ్యత అప్పగించడం జరిగింది, విరోధులు ఆయన(స) నిద్ర పోతున్నట్లు భ్రమ పడాలని!

ప్రవక్త మహనీయులు(స) అలీని పడుకోబెట్టి తన దుప్పటి కప్పి, తన వద్ద ఉన్న మక్కా వాసుల అప్పగింతల్ని, తెల్లవారిన తరువాత ఎవరివి వారికి అందజేయాలని, ఆ తరువాతనే మదీనాకు రావాలని వివరంగా అవగతపరిచారు. మహనీయ అలీ అలాగే తన వద్ద కరవాలం పెట్టుకుని మరీ నిద్ర పోయారు. ఆ పైన ప్రవక్తశ్రీ(స) దైవకృపతో తనను చుట్టుముట్టిన దుండగుల కళ్ళు గప్పి బయటికి నడిచారు. తెల్లవారిన తరువాతనే మక్కా దుండగులకు తెలిసింది, పడక పైన ఉన్నవారు మహనీయ అలీ అని!

వారి ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. వారు ఇంట్లోకి చొరబడి అలీని అడిగారు, ముహమ్మద్ (స) ఎక్కడున్నారని. తనకు ఏమీ తెలియదని చెప్పారు అలీ. కోపంతో ఓ చెంపపెట్టు ఇచ్చారు, దానితో సరిపుచ్చలేదు. ఆయన్ని పట్టుకు వెళ్లారు, ఎంతో కొట్టి చూశారు, ఆయనకు తెలిస్తేగా చెప్పడానికి? ఆయన్ని పట్టి, కొట్టి ప్రయోజనం లేదని భావించారేమో వదలి పెట్టారు. మహనీయ అలీ ఇంటికి వచ్చి, ప్రవక్తశ్రీ అప్పజెప్పిన అప్పగింతలన్నీ మక్కా వీధులన్నీ తిరిగి తిరిగి, వెదికి వెదికి ఎవరివి వారికి అందజేశారు. ఆ తరువాతనే మదీనా వైపునకు బయలుదేరారు.

### ఇహ పరాలలో సోదరుడు!

రాత్రిళ్ళు పూర్తిగా, పగలు సగం నడుస్తూ మధ్యాహ్నం దాక్కుంటూ ప్రయాణం సాగించారు. వెంట తినడానికంటూ ఏమీలేదు. ఎన్నో రోజుల తరువాత మదీనా పొలిమేరలోని 'కుబా' చేరి ప్రవక్తశ్రీ(స)ని కలుసుకున్నారు. ఆపైన దైవ సందేశహరులు కుబా నుండి మదీనాకు బయలుదేరినప్పుడు అలీ అప్పటి చారిత్రక ఊరేగింపులో పాల్గొన్నారు!

మదీనాలో ముహాజిరులు, అన్సారుల మధ్య ప్రేమాభిమానాలు పెరగడానికి ప్రవక్తశ్రీ(స) ఇస్లామీయ సోదరత్వం స్థాపించారు. ఆ సందర్భంలో మహనీయ అలీకి అలాంటి సోదరత్వం ఏదీ కల్పించలేదు ఆయన. అలీ(ర) ప్రవక్తశ్రీ(స)ని అడిగారు కూడా. దానికి ఆయన(స), "అలీ! చింతిస్తున్నావెందుకూ? నేనున్నానుగా నీకు సోదరుణ్ణి, (అలీ ప్రవక్త

బాబాయి కుమారుడు) ఇహలోకంలోనూ పరలోకంలోనూ!'' అన్నారు.

★★★

# 2. మదీనాలో

హిజ్రత్ చేసి మక్కా నుండి మదీనాకు వచ్చిన పిదప 'మస్జిదున్నబవీ' ('ప్రవక్త మస్జిద్') నిర్మాణంలో మట్టి, రాళ్ళు మోయడం మొదలుకొని విభిన్న కార్యక్రమాలలో మహనీయ అలీ(ర) పాత్ర చాలా చురుగ్గా సాగింది. హిజ్రీ 2వ సంవత్సరం ప్రారంభంలో చిన్న చిన్న కార్యక్రమాలు, సందేశ ప్రచారంతో సహా విభిన్న రూపాల్లో కొనసాగాయి. వాటన్నింటిలో ఆయన తనకు అప్పగించిన బాధ్యతల్ని కష్టపడి సక్రమంగా అత్యంత శ్రద్ధగా నిర్వహించారు.

## బద్ర్‌లో ఆయన పాత్ర

హిజ్రీ 2వ సంవత్సరం, క్రీ. శ. 623 మార్చి నెలలో మక్కా బహు దైవారాధకులు వెయ్యి మంది యోధుల్ని, వారిలో 600 మంది కవచ ధారులు, వంద మంది అశ్వారూఢులను వెంటబెట్టుకుని, మదీనా ముస్లిములను తుద ముట్టించాలని బయలుదేరారు. ఆ సమాచారం తెలుసుకున్న ప్రవక్తశ్రీ(స రమజాన్ నెలలో దైవ దాసులయిన మూడు వందల కన్నా కొంత ఎక్కువ మందిని వెంట తీసుకుని వారిని ఎదుర్కొనేందుకు సమాయత్తమయ్యారు.

ముస్లిముల వద్ద వాహనాలయినా, ఆహార సామగ్రి అయినా చాలా తక్కువ. వాహనాలుగా డెబ్బయి ఒంటెలు, రెండు మూడు గుర్రాలు మాత్రమే. అలీ చేతిలో ఓ నల్లని జెండా మాత్రం గాలిలో ఎగురుతూ కనబడుతోంది. వాహనాల పైన వంతులవారీగా సిపాయీలు స్వారీ చేసేవారు. బద్ర్ మైదానంలో ఇరు వైపుల సేనికులు రమజాన్ నెల 17వ తేదీన వరుసలు దీరి మార్కునేందుకు సిద్ధమయ్యారు. విరోధి సైనికులు అరబ్బుల పద్ధతి ప్రకారం పోరు ప్రారంభించారు.

తొలుత ఎదుటి పక్షంలోని యోధులు, వారి నాయకమాన్యుడు, ఉత్బా, తన తనయుడు వలీద్, సోదరుడు షైబాతో ముందుకు వచ్చి గర్వంగా కేకవేసి, ''తమ రక్తంతో స్నానమాడ గోరిన వారు ముందుకు రావలసింది''గా ఛాలెంజ్ చేశాడు. ముస్లిముల నుంచి ముగ్గురు అన్సారీ యోధుల్ని పంపారు ప్రవక్త. ఉత్బా, ''మీరు మదనీలు, మాతో మీ పోలిక ఏమిటి, మాకెదురుగా కురైషీలు రావాలి'' అన్నాడు. అన్సారీలను తిరిగి రప్పించుకుని ప్రవక్త, తన బాబాయి హమ్జాను వలీద్ కెదురుగాను, మహనీయ అలీని షైబా కెదురుగాను, ఉబైదా బిన్ హారిస్‌ని ఉత్బా కెదురుగాను పంపారు.

మైదానంలో వచ్చీ రాగానే మహనీయ హమ్జా వలీద్ ని కరవాలానికి ఆహుతి చేశారు. మహనీయ అలీ షైబా వైపుగా యుద్ధగానం ఆలాపిస్తూ లంఘించారు. అతను, ''మార్కొన్నప్పుడు నోరు కాదు, కరవాలం ఆడించాలి'' అన్నాడు. అతని నోటి నుంచి ఇంకా ఈ వాక్యం పూర్తి కాక ముందే మహనీయ అలీ కరవాలం అతని మెడను ఛేదించి వేసింది. ఉత్బా మహనీయ ఉబైదాని గాయపరచడం గమనించి మహనీయ అలీ, మహనీయ హమ్జా ఇరువురు అటు వెళ్ళారు. అంతే, ఉత్బాని అంత మొందించారు.

ఆ తరువాత ఇరువైపుల నుంచి సిపాయీలు విరుచుకు పడ్డారు. సాధారణ యుద్ధం రగులుకుంది. మహనీయ అలీ తన శౌర్యంతో అందరినీ ఆకట్టుకున్నారు. దైవ సహాయంతో ముస్లిములు విజయం సాధించారు. ప్రవక్తశ్రీ(స) యుద్ధ ప్రాప్తిని, 70 మంది బహుదైవారాధకుల్ని ఖైదీలుగా తీసుకుని రమజాన్ 22న మదీనా చేరారు. మహనీయ అలీ ధైర్యసాహసాలు శౌర్యానికి గుర్తింపుగా ఆయనకు 'హైదర్ కర్రార్' అని బిరుదు నిచ్చారు. (అంటే విరోధిని తరిమి కొట్టే అడవి పులి అని దాని అర్థం)

బద్ర్ నుండి తిరిగి వచ్చే వరకు గత్ఫాన్ అనే తెగవారు ముస్లిముల మీదికి దాడి చేయడానికి ప్రోగవుతున్నారని తెలిసింది. కాగా ప్రవక్త మహనీయులు మహనీయ అలీ చేతికి సైనిక ధ్వజం ఇచ్చి అటుగా బయలు దేరారు. కాని అక్కడికి వెళ్ళే వరకు వారు ముస్లిములు వస్తున్న సమాచారం తెలిసి పలాయనం చిత్తగించారు. మూడు రోజులు గత్ఫాన్ ప్రాంతంలో ఆగి ముస్లిములు మదీనాకు తిరిగి వచ్చేశారు. అటునుంచి వచ్చిన తరువాత బద్ర్‌లో ప్రాప్తమయిన యుద్ధ ప్రాప్తిని ముస్లిమ్ యోధుల్లో పంచివేశారు ప్రవక్తశ్రీ(స). మహనీయ అలీకి ఒక ఒంటె, ఓ కవచం, ఓ కరవాలం లభించాయి.

## ప్రవక్త(స) కూతురుతో పెళ్లి

ప్రవక్త(స) ప్రథమ సతీమణి మహనీయ ఖదీజా(ర) కూతుళ్ళలో చిన్నవారు మహనీయ ఫాతిమా(ర). ప్రవక్తశ్రీ(స) మదీనా వచ్చిన కొన్నాళ్ళకు ఓ సహచర మాన్యుల్ని మక్కా పంపించారు. ఆయన విశ్వాసుల మాతృమూర్తి మహనీయ సౌదా, కూతుళ్ల ఉమ్మె కుల్సూమ్, ఫాతిమాలను తోడుగా తీసుకువచ్చారు. అప్పటికి, ఓ ఉల్లేఖనం ప్రకారం మహనీయ ఫాతిమా వయసు 17 సంవత్సరాలు. దైవ సందేశహరులు మహనీయ అలీ(ర) తో ఆమె వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు.

ఓ రోజు మహనీయ అలీ (ర) ప్రవక్త(స) వద్దకు వచ్చి సలామ్ చేసి కూర్చున్నారు. ప్రవక్తశ్రీ అలీని అడిగారు, ''ఏమిటి అలీ, ఏం కావాలి?'' ఆయన ఏమీ పలక లేకపోయారు. ''కాస్సేపటికి ఆయన మళ్ళీ అడిగారు, ''అలీ, ఏమిటి విశేషం? ఓహో,

ఫాతిమాని కోరాలని వచ్చావా?'' అప్పుడు తలెత్తి చూసి తిరిగి సిగ్గుతో తల దించుకున్నారు అలీ(ర).

''నీ వద్ద మహ్ర్ చెల్లించడానికి ఏముంది'' అని అడిగారు ప్రవక్తశ్రీ. ''ఏముందీ, ఒక గుర్రం మరి ఓ కవచం తప్ప!'' అన్నారు అలీ. దానికి ప్రవక్త మహనీయులు, ''గుర్రమయితే నీకు సదా అవసరమయిందే, పోతే కవచం అమ్మివేయగలవు'' అన్నారు ప్రవక్తశ్రీ(స). మహనీయ ఉస్మాన్(ర) ఆ కవచనాన్ని 480 దిర్హములకు కొన్నారు. ఇక నికాహ్ తేదీ నిర్ణయమయింది. నిర్ణీత దినాన ప్రవక్తశ్రీ మహనీయ బిలాల్ని బజారుకు పంపించి సుగంధ ద్రవ్యాలు ఖర్జూరాలు తెప్పించారు. అస్ర్ తరువాత నికాహ్ జరిగిపోయింది.

మహనీయ అలీ(ర) కొత్త సంసారం కొరకు మహనీయ హారిసా బిన్ నోమాన్ ఇంటిని అరువుగా ఇప్పించారు ప్రవక్తశ్రీ(స). ఆ రాత్రి మహనీయ అలీ, ఫాతిమా దంపతులు ఆ ఇంటనే బస చేశారు. మరుసటి రోజు ప్రవక్తశ్రీ మహనీయ అలీ(ర)ని వలీమా చేయాలని పురమాయించారు. తన వద్ద ఉన్న ఓ పొట్టేలు, అన్సారులు తెచ్చి ఇచ్చిన మొక్కజొన్నల పిండి ద్వారా అలీ తన అభీష్టం మేరకు ఘనంగా వలీమా విందు ఏర్పాటు చేశారు. జనం కూడా బాగానే వచ్చారు, విందు కూడా ఘనంగానే జరిగింది. లోగడ ఎన్నడూ ఇంత ఉత్తమ వంటల విందు బనీ ముత్తలిబ్లో జరగలేదని ప్రతీతి!

## ప్రవక్తశ్రీ(స) శిక్షణా విధానం

ఉభయులకూ పెద్దలు, శిక్షణ గరిపేవారు స్వయంగా ప్రవక్త మహనీయులే. దంపతుల సంబంధాలు సౌజన్య రీతిలో సాగేవి. దానికి ప్రధాన కారణం ప్రవక్త మహనీయులు(స). అప్పుడప్పుడు ఇరువురిలో ఏదయినా మనక్లేశం కలిగితే ప్రవక్తశ్రీ సర్దిచెప్పే వారు.

ఒకసారి ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. మహనీయ ఫాతిమా నాన్నతో తన మాట వినిపించ డానికి ప్రవక్త ఇంటికి బయలుదేరారు. మహనీయ అలీ కూడా వెనకాలే రాసాగారు. అయితే ఆయన(స) కూతురు మాట విని, ''ఏ భర్త అయినా తన భార్య ఎడల మన్నింపు వైఖరి అవలంబిస్తాడా నీవే కాస్త ఆలోచించుకో వలసింద''ని చెప్పారు ఫాతిమాకు. అంతే, వెనకాలే వస్తున్న అలీ ఆ మాటలు విని బాగా ప్రభావితులయ్యారు. మహనీయ ఫాతిమాతో, ''ఇక మీదట నీకు బాధ కలిగించే ఏ మాటా నేను పలకకుండా ఉండేందుకు యత్నిస్తాను'' అని మాటిచ్చారు.

## అబూ తురాబ్!

ఓనాడు ప్రవక్తశ్రీ(స) తన కుమార్తె ఇంటికి వెళ్లారు, సలాములు, యోగక్షేమాలు అయిన తరువాత అడిగారు, అలీ ఏరి అని. దానికి ఫాతిమా, ''మా మధ్య మాటా మాటా పెరిగి ఆయన కోపంతో బయటకు వెళ్లి పోయారు'' అని పలికారు. ప్రవక్తశ్రీ మస్జిద్కు వెళ్లి చూడగా అక్కడ అలీ మస్జిద్ నేల పైనే పడుకుని ఉన్నారు. వీపు పై నుంచి బట్ట తొలిగి ఉంది, నేల మట్టి ఒంటి మీద అంటుకుని ఉంది. ఆయన చేత్తో అలీని కుదిపారు. లాలనగా చిరునవ్వుతో, ''ఓ అబూ తురాబ్ (మట్టి బాబు)! ఇక లెయ్యి, ఓ అబూతురాబ్! ఇక లెయ్యి,'' అని లేపారు. ఆయన లేచి ప్రవక్తశ్రీ(ర) తోపాటు తన ఇంటికి వచ్చేశారు. ఆ నాటి నుంచి ఆయన బిరుదు ''అబూతురాబ్'' అయిపోయింది!

★★★

# 3. అలీ(ర) విభిన్న పాత్రలు

## ఉహుద్లో

ఉహుద్ పోరాటంలోనూ ఇస్లామీయ యోధుల ధ్వజవాహకులుగా మహనీయ అలీ(ర)నే నియమించడం జరిగింది. ఆయన వీరోచితంగా పోరాడారు. అయితే రెండవ దశలో పరిస్థితి మారిపోయినప్పుడు శత్రువు వెనక నుంచి దాడి జరిపాడు. ఆ సమయంలో ప్రవక్తశ్రీ యాదృచ్ఛికంగా ఓ గుంటలో పడిపోయారు. మహనీయ అలీ వెంటనే చెయ్యి అందించి పట్టుకున్నారు. మహనీయ తల్హా(ర) లోనికి దుమికి ప్రవక్తను పైకి ఎక్కేందుకు సహాయపడ్డారు.

## ప్రవక్తకు గాయం

ఆ సందర్భంలోనే దుష్టుడు ఇబ్ను కుమ్మ ఎటు నుంచో వచ్చి కరవాలంతో ప్రవక్త పైకి దాడి చేశాడు. దాని వల్ల కవచంలోని రెండు కడియాలు ఆయన చెంపలోకి చొరబడ్డాయి. ఆయన జ్యోతిర్మయ ముఖం రక్తసిక్తమయి పోయింది. ఆ తరువాత శత్రువులు రువ్విన రాళ్ళతో మునిపల్లు రెండు విరిగి పోయాయి. మహనీయ అలీ దుఃఖ పడుతూనే డాలులో నీరు తేగా మహనీయ ఫాతిమా(కుమార్తె) కన్నీరుకారుస్తూ ఆయన(స) ముఖం కడిగారు.

ఆ రోజు మక్కా సేనా నాయకుడు అబూ సుఫ్యాన్, ''నేడు బద్ర్ ఓటమికి బదులు తీర్చుకోవడం జరిగింది, వచ్చే సంవత్సరం మళ్ళీ కలుసుకుందాము'' అని ప్రకటించి వెళ్ళిపోయాడు. కాని పూర్తిగా ఓడించాలన్న స్పృహ, పరాజితుల్ని ఖైదీలుగా చేసుకోవాలన్న ఆలోచన, యుద్ధ ప్రాప్తిని ప్రోజేయాలన్న మాట తట్టలేదు ఎవరికీ. అబూ సుఫ్యాన్కు ఈ విషయాల స్పృహ కలగగానే తిరిగి వస్తాడని, మదీనా పైకి దాడి చేస్తాడని శంకించారు ప్రవక్త శ్రీ. అందువల్ల మహనీయ అలీని కొంత దూరం వరకు వారిని వెంబడించి చూడవలసిందని పంపారు. కాని మహనీయ అలీ తిరిగి వచ్చి వారు వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోతున్నారని తెలిపారు. ✤




# బంగ్లా ముక్తి బాహినీ మొదలుకుని షేఖ్ హసీనా ఉద్వాసన వరకు

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

**దక్షిణాసియా**లో భారతదేశానికి నమ్మదగ్గ ఏకైక పొరుగుదేశం బంగ్లాదేశ్. అంతేకాదు, ఆ దేశం ఇండియా కలల పంట. 1971లో బంగ్లా ప్రజలు పాకిస్తాన్ నుండి విడిపోవటానికి ఉద్యమించినప్పుడు, బంగబంధు ముజీబుర్రహ్మాన్ అభ్యర్థనపై అప్పటి భారత ప్రధాని శ్రీమతి ఇందిరా ప్రియదర్శిని నెహ్రూ గాంధీ సారథ్యంలో భారత సేనలు ఆనాటి తూర్పు పాకిస్తాన్‌లోని బెంగాలీలకు కొండంత అండగా నిలిచారు. ఆ విధంగా తూర్పు పాకిస్తాన్ కాస్తా స్వతంత్ర బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించింది.

ఆనాటి నుండీ నేటివరకు బంగ్లాదేశ్ ఇండియాకు నమ్మదగ్గ నేస్తంగానే ఉంది. అటువంటి మిత్రదేశం నేడు ఒక్కసారిగా అరాచకానికి, విధ్వంసానికి ఆలవాలంగా మారింది. ఏలినవారిపై విద్యార్థుల్లో రాజుకున్న అసంతృప్తి చూస్తుండగానే దావానలంలా వ్యాపించి యావద్దేశాన్ని చుట్టు ముట్టేసింది. విద్యార్థి ఉద్యమం కాస్తా బహుముఖ నిరసనోద్యమంగా మారింది. విద్యార్థులకు- ప్రభుత్వ అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలకు మధ్య వీధిపోరాటం జరిగింది. సేనలకు- విద్యార్థులకు మధ్య సమరం జరిగింది. 350 మంది ఈ హింసలో అసువులు బాసారు. వేలాది మంది గాయపడ్డారు. లెక్కలకు అందనంత ఆస్తి నష్టం జరిగింది. కడకు ఆ దేశ ప్రధాని షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి హుటాహుటిన స్వదేశం నుండి పలాయనం చిత్తగించింది.

## కాలచక్రపు మిట్టపల్లాలు

1979లో ఈరాన్ చక్రవర్తి రజాషా పహెల్వీ నెమలి సింహాసనాన్ని వీడి విదేశాలకు పారిపోయినట్లే ఇప్పుడు ముజీబుర్రహ్మాన్ ముద్దుల పుత్రిక భారతదేశానికి వచ్చి, 'చరణం శరణం గచ్ఛామి' అంది. ఎంతలో ఎంత వ్యత్యాసం!? జులై 5వ తేదీ మధ్యాహ్నం వరకు బంగ్లాదేశ్‌లో తిరుగులేని నేతగా వర్ధిల్లిన షేఖ్ హసీనా అదే రోజు సాయంత్రం ఆరయ్యేసరికి న్యూఢిల్లీ శివార్లలో శరణార్థిగా దిక్కుతోచక దిక్కులు చూడాల్సిన పరిస్థితి!! బ్రిటన్‌లో తలదాచుకోవాలని ప్రయత్నించింది. కాని బ్రిటన్ ఆమెకు వీసా ఇవ్వడానికి నిరాకరించింది. అమెరికా ఏకంగా ఆమె వీసాను రద్దు చేసింది. ఎక్కడికెళ్ళావో అక్కడే ఉండమని కొంతమంది పెద్దలు తమకు తోచిన సలహా ఇస్తున్నారు. **"ఇవి కాలచక్రపు ఎగుళ్ళు దిగుళ్ళు. వీటిని మేము మనుషుల మధ్యన త్రిప్పుతూ ఉంటాము"** (ఖుర్‌ఆన్ 3: 140).

## ఎందుకీ అవస్థ?

2009 నుండి 2024 వరకు నిరాఘాటంగా 15 ఏండ్లు ప్రధానిగా పరిపాలించిన షేఖ్ హసీనాకు ఈ దురవస్థ ఎందుకు దాపురించింది? అని ప్రశ్నించుకుంటూపోతే చాలా విషయాలు ముందుకు వస్తాయి.

బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబీకులకు, సైనికుల కుటుంబీకులకు ప్రభుత్వోద్యోగాల్లో ఏకంగా డెబ్భయి శాతం రిజర్వేషన్ కల్పించారు. 2017లో బంగ్లాదేశ్ ఉన్నత న్యాయస్థానం ఈ కోటా చెల్లదని తీర్పు ఇవ్వటంతో తాత్కాలికంగా ప్రభుత్వం దానికి తలవంచింది. కాని ఇటీవల మళ్ళీ ఆ కోటాను 56 శాతంగా ఖరారు చేయటంతో ఉపాధి అవకాశాలు కోల్పోతున్న ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ప్రభుత్వం 49 మెట్లు దిగివచ్చి ఆ రిజర్వేషన్ కోటాను 7 శాతంగా ఖరారు చేసింది. అయినా విద్యార్థులు

శాంతించ లేదు. హసీనా ప్రభుత్వం కేవలం అవామీ లీగ్ కార్యకర్తల ఇష్టారాజ్యంగా మారిపోయిందనీ, ఆమె అయినవారికి ఆకులో కానివారికి కంచంలో పెడుతోందని విద్యార్థులు వాపోతున్నారు. దానికితోడు గత పదిహేనేళ్ళుగా అధికార పార్టీ కక్షసాధింపు చర్యలు యధేచ్ఛగా కొనసాగాయి. ప్రతిపక్ష పార్టీల కీలక నేతలను చెరసాల పాల్జేయటం జరిగింది. మాజీ ప్రధాని బేగం ఖాలిదా జియా సైతం ఏండ్ల తరబడి జైలు జీవితం అనుభవించి జులై 7వ తేదీన విడుదలైన సంగతి గమనార్హం.

బంగ్లాదేశ్‌కు చెందిన జమాఅతె ఇస్లామీ అగ్రశ్రేణి నాయకులను ఉరికంబం ఎక్కించారు. మరెందరో నేతలు ఇప్పటికీ కారాగారాల్లో మగ్గుతున్నారు. ఆఖరికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన విద్యార్థులపై సయితం హసీనా ప్రభుత్వం ఆటంకవాదులనే ముద్ర వేసింది.ఈ విధంగా ప్రజాస్వామ్యం ముసుగులో ఏకసత్తాక, నిరంకుశ నియంతృత్వ ధోరణులు ప్రబలిపోయి, కర్ర కలవాడిదే బర్రె అన్న చందాన సాగింది ఆమె పరిపాలన. ఆమె హయాంలో బంగ్లాదేశ్ ప్రగతిపథంలో పయనించిన మాట వాస్తవమే. కాని ఏ అభివృద్ధి చెందుతున్న దేశంలోనయినా 'సామాజిక న్యాయం' దొరకని దినుసులా మారినప్పుడు, ఏదో ఒక రోజు ప్రజల్లో అసంతృప్త లావా పెల్లుబుకక మానదు. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో జరిగింది అదే. రిజర్వేషన్ల రగడగా మొదలైన విద్యార్థుల నిరసన 'అంతర్యుద్ధం' తరహాలో సాగింది. చివరకు పరిస్థితి విషమించి సైనికులు సైతం చేతులెత్తేయాల్సి వచ్చింది.

## హ్యూమన్ మెమరీ ఈజ్ టూ షార్ట్

విద్యార్థి ఉద్యమాలు, వాటి పరిణామాలు ఎలా ఉంటాయో మనకు తెలియనిది కాదు. బంగ్లాదేశ్ పరిణామాల వెనుక ఎవరో ఉన్నారని, ఏదో చేస్తున్నారని ఊహాగానాలు చేయటం అనవసరం. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ కాంపస్ నుండి ఉగ్ర రూపం దాల్చిన తెలంగాణ ఉద్యమం ఎలా పరిణమించింది? 1975లో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ సారథ్యంలో మొదలైన సంపూర్ణ విప్లవం (Total Revolution) వెనుక ఉన్నది విద్యార్థులు కాదా? చివరకు ఆ విప్లవం 1977లో కాంగ్రెస్ పార్టీని గద్దె దించలేదా? 1990లో మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు సాగించిన రిజర్వేషన్ల రగడ ఆనాటి భారత ప్రధాని వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కూల్చటంలో ప్రధాన భూమిక పోషించ లేదా? ఇప్పుడు బంగ్లాదేశ్ పరిణామాలను కూడా మనం ఆ దృష్టి కోణంతోనే ఎందుకు చూడకూడదు? బంగ్లా జాతి పిత ముజీబుర్రహ్మాన్ విగ్రహాలను కూలగొడుతున్న వైనాన్ని కూడా చాలా ఫోకస్ చేసి చూపెడుతున్నారు. న్యూయార్క్ నగరంలోని బంగ్లా దౌత్య కార్యాలయం నుండి ముజీబుర్రహ్మాన్ విగ్రహాన్ని తొలగించటాన్ని కూడా విపరీతమైన చేష్టగానే చూపెడుతున్నారు. నిన్నగాక మొన్న తెలంగాణ ఉద్యమంలో భాగంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆంధ్రుల విగ్రహాల పట్ల ఉద్యమకారులు చేసిన వ్యవహారం ఎలాంటిది? మాస్కో నగరంలో లెనిన్, మార్క్స్ విగ్రహాలకు పట్టిన గతేమిటి? కాని మనం ఇలాంటి సందర్భాలలో గతాన్ని నెమరువేసుకునేది తక్కువే. 'హ్యూమన్ మెమరీ ఈజ్ టూ షార్ట్'.

## సంయమనం పాటించాలి

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితిలో స్వదేశం విడిచి వచ్చిన షేఖ్ హసీనాకు భారత ప్రభుత్వం ఆశ్రయం ఇవ్వటం సమంజసమేనా? అన్నది ఒక ప్రశ్న. బంగ్లాదేశ్ నాయకురాలిపై గల సానుభూతిని అర్థం చేసుకోవచ్చు. కాని దౌత్యపరంగా ఇది ఎంతవరకు సరైనది? 1971లో మెజారిటీ బంగ్లా ప్రజల కోరికపై శ్రీమతి ఇందిరాగాంధీ సాహసోపేతంగా 'చర్య' గైకొన్నారు. కాని ఇప్పటి పరిస్థితి వేరు. ఇప్పుడు బంగ్లాదేశ్‌లోని మెజారిటీ ప్రజలు షేఖ్ హసీనాకు వ్యతిరేకంగా ఉన్నారు. ఆమెకు ఆశ్రయం కల్పించటమంటే కోట్లాది మంది బంగ్లా ప్రజల మనోభావాలను లక్ష్యపెట్టకపోవటమే. జులై 5వ తేదీ వరకు కేవలం షేఖ్ హసీనాకు వ్యతిరేకంగా ఉన్న విద్యార్థుల నిరసన ప్రదర్శన జులై 6వ తేదీకల్లా భారతదేశానికి వ్యతిరేకంగా మారినట్లు వార్త. అంతేకాదు, ఆ నిరసన ప్రదర్శనలు మతం రంగు పులుముకుంటున్నట్లు కూడా సమాచారం అందు తోంది. అయితే అక్కడి దేవాలయాలలోని భగవద్గీత, ఇతర హైందవ మత గ్రంథాలు సురక్షితంగా ఉన్నట్లు కొన్ని టీవీ ఛానళ్ళు ఫోటోలతో సహా ప్రసారం చేశాయి. అలాగే కొన్ని మందిరాలకు రక్షా కవచంగా అక్కడి ప్రజలు నిలిచినట్లుగా కూడా ఫొటోలతో సహా వార్తలొచ్చాయి. ఈ సమాచారంలో ఉన్న వైరుధ్యం చాటి చెప్పేదేమిటి?

ఇలాంటి సందర్భాల్లో ప్రచార ప్రసార సాధనాలు, పార్లమెంట్ సభ్యులు, ప్రభుత్వం- అందరూ ఎంతో నిగ్రహంతో, సంయ మనంతో వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉంది. పొరుగు దేశంలో నెలకొన్న రాజకీయ అస్థిరత స్వయంగా మనకూ మంచిది కాదు. బెంగాలీలు (ప.బెంగాల్ ప్రజలు గానీ, బంగ్లా దేశీయులు గానీ) స్వతహాగా ఆవేశపరులు. వారు ఒకసారి ఆగ్రహోదగ్రులయ్యా రంటే, వారిని నిలువరించటం కష్టం. అందుకే ఎలక్ట్రానిక్ మీడియా అయినా, ప్రింట్ మీడియా అయినా అగ్నికి ఆజ్యం పోసే పని చేయకూడదు. అందులోనూ బంగ్లాదేశ్‌తో ఇండియాకు 4వేల కిలోమీటర్ల సుదీర్ఘమైన సరిహద్దు ఉంది. మనం మన రక్షణ కోసం ఏమైనా జాగ్రత్తలు తీసుకోవచ్చు. అదేవిధంగా బంగ్లాదేశ్ పరిణామాలను బంగ్లాదేశ్ ఆంతరంగిక వ్యవహారంగానే చూడాలి. ప్రజాగ్రహానికి కారణమయ్యే ప్రకటనలు చేయటం గానీ, వారి మనోభావాలను గాయపరిచే విధంగా వ్యాఖ్యానించటం గానీ భావ్యం కాదు. బంగ్లాదేశ్‌తో మన స్నేహ బంధం మరింత బల పడాలి. ఉభయదేశాల ప్రజల మధ్య సహిష్ణుత దెబ్బ తినకుండా చూడాలి.

## కొసమెరుపు

ఈ వ్యాసం వ్రాసే సమయానికి అక్కడి విద్యార్థుల ఆకాంక్ష మేరకు నోబెల్ బహుమతి గ్రహీత, ఆర్థికవేత్త ముహమ్మద్ యూనుస్‌ను బంగ్లా తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమించినట్లు వార్త వచ్చింది. ఇది కొసమెరుపు. త్వరలోనే అక్కడ నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగి, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఏర్పడాలి. పొరుగు దేశంలో శాంతి సుస్థిరత నెలకొనాలన్నది మా ఆకాంక్ష.



# రెక్కలు తెగిన బాల్యం ...?

- డాక్టర్ మహ్మద్ హసన్

పాపం, పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ ఏమీ ఎరుగని పూవుల్లారా! అయిదా రేడుల పాపల్లారా! మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే అవి మీకే అని ఆనందించే కూనల్లారా! మీదే, మీదే సమస్త విశ్వం! మీరే లోకపు భాగ్యవిధాతలు! ఉడుతల్లారా ! బుడుతల్లారా! ఇది నా గీతం వింటారా? అంటూ కల్మష మెరుగని బాల్యానికి అక్షరాల ఆకారం ఇచ్చాడు **మహాకవి శ్రీశ్రీ.** ప్రతీ మనిషి జీవితంలో రంగుల కలబోత "బాల్యమే". మలినం లేని చలనం వారి స్వంతం బుడిబుడి అడుగులు, బోసి నవ్వులు ఎంతటి పాషాణ హృదయులనైన యిట్టే కరిగిస్తాయి.

ఈ మధ్యకాలంలో వచ్చిన రెండు పాన్ ఇండియా సినిమాలలో (యానిమల్, సలార్) "బాల్యం" నేపథ్యంతోనే సినిమాలో ప్రధానంగా చూయించటం జరిగింది. తండ్రిని అమితంగా ఇష్టపడే కుర్రాడికి, ఆ తండ్రి వ్యాపార పనులలో పడి అశ్రద్ధ చేస్తాడు, రోజు ఇంటికి ఏ రాత్రి వేళల్లోనో రావటం అప్పటికే పిల్లలు గాఢ నిద్రలో వుండటం, పిల్లలు లేచే సమయానికే తిరిగి మళ్ళీ వ్యాపార పనుల నిమిత్తం బయటికి వెళ్ళటం ప్రతిరోజు జరుగుతుంది. ఈ క్రమంలో తండ్రి పెద్ద వ్యాపార సామ్రాజ్యం నిర్మిస్తాడు, దానికి సమాంతరంగా బాలుడు పెరిగి పెద్దవాడవుతాడు. నాటకీయంగా తండ్రి ఎదుగుదలను తట్టుకోలేని వారి బంధువులు "హీరో" ఐన బాలుడి తండ్రిని చంపి ఆస్తి కాజేయాలని చూడటం, అల్లుడు కూడా స్వంత మామను చంపాలని కుట్రలు చేయటం మొదలైన విషయాలన్నీ హీరోకి తెలుస్తాయి. ఈ క్రమంలో స్వంత బావను చంపటం, తన తండ్రికి వున్న శత్రువులను గుర్తిస్తు ఒక్కొక్కరిని చంపుతూ చివరికి "ఉన్మాదిలా" మారతాడు, కథ చివరలో తన కుమారుడు తన కోసమే ఇలా మారాడని తండ్రి గ్రహిస్తాడు. ఈ కథ ద్వారా మనం తెల్సుకోవాల్సిందేమంటే ఆ పిల్ల వాడికి బాల్యంలో తండ్రి నుండి దక్కాల్సిన "ప్రేమ" దొరికితే "యానిమల్" (జంతువు) లాగా మారకుండా ఉండేవాడు కాదేమో అన్నది ప్రశ్న. అది కథ, దానికి కొంత నాటకీయతను జోడించి మొత్తానికి "బ్లాక్ బస్టర్" జాబితాలోకి నెట్టేశాడు ఆ సినిమా దర్శకుడు.

ఇక మరో సినిమా "సలార్" ఈ సినిమాలో హీరో తల్లి (ఈశ్వరీ రావు) హీరో బాల్యంలో జరిగిన ఓ సంఘటనతో ఆ ప్రాంతం నుండి చిన్న పిల్ల వాడిని తీసుకొని దూరంగా వెళ్ళి ఓ ప్రాంతంలో చిన్న పిల్లలకు పాఠాలు చెబుతూ గడుపుతుంది. కొడుకు ప్రభాస్ (పాత్ర పేరు దేవా) ఇంటికి ఆలస్యంగా వచ్చినా భయపడుతుంది. అతని చేతిలో చిన్న "ఆయుధం" కనిపించినా భయపడుతుంది. తన తల్లి అలా మారటానికి గతంలో జరిగిన సంఘటనలు పిల్లవాడిపై ప్రభావం చూయించకుండా దూరంగా వెళ్తుంది. కానీ హీరో మళ్ళీ హింసాత్మక సంఘటనల వైపు మళ్ళీ తెర మీద "బీభత్సాన్ని" సృష్టిస్తాడు. ఇందులో కూడా "బాల్యమే" అంతర్లీనంగా ప్రభావం చూపుతుంది అనేలా దర్శకుడు కథకు మసాలా జోడించి విజయం సాధించాడు.

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా చిన్న పిల్లలపై జరుగుతున్న కొన్ని సంఘటనలు చూద్దాం: 24 – ఫిబ్రవరి 2022న రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసింది, ఫలితంగా రెండు దేశాల మధ్య యుద్ధం మొద లైంది. ఉక్రెయిన్‌కి అండగా అగ్రరాజ్యం అమెరికా

వెన్నుదన్నుగా వుండి ఆయుధాలు సరఫరా చేస్తూ కపట నాటకం ప్రదర్శిస్తూ ఓ వైపు శాంతి మంత్రం జపిస్తూ మరోపక్క యుద్ధాన్ని ప్రోత్సహిం చడం మూలంగా లక్షలాది మంది నిరాశ్రయులైన పొరుగు దేశాలకు వలస వెళ్ళటం, వేల మంది చనిపోవటం మనకు తెలిసిన విషయమే. ఇక ఉక్రెయిన్ నగరం దాదాపుగా ధ్వంసమై పోయింది, లక్షల మంది చిన్నారులు పొరుగు దేశాల్లో వలస జీవుల మాదిరిగా జీవించాల్సిన పరిస్థితి. యుద్ధం చేస్తున్న రెండు దేశాలు యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్నా, అమెరికా, యూరోపియన్ దేశాలు చిన్నారుల భవిష్యత్ గూర్చి ఆలోచించకపోవటం బాధాకరం. మరొక అంశం ఇజ్రాయిల్, పాలస్తీనా, (హమాస్) దేశాల మధ్య ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం. ఇది 7 అక్టోబర్ 2023 న ప్రారంభమై చిలికి చిలికి గాలివానగా మారి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యత కల్గిన అంశంగా తయారైంది. అక్కడ జరుగుతున్న నరమేధం పట్ల యావత్ ప్రపంచం సానుభూతిని వ్యక్తం చేస్తోంది. ఈ పది నెలల కాలంలోనే సుమారు నలభై వేలమంది చనిపోవటం, ఇందులో చిన్న పిల్లలే మూడువంతులుకు పైగా వున్నారంటే యుద్ధాల వల్ల నష్టపోయేది ఎవరనేది ఈ పాటికే అర్థం చేసుకోవచ్చును. "గాజాలో" పిల్లలు ఆహారం దొరక్క గడ్డితిని, బురద మన్ను తింటూ గడుపుతున్న దృశ్యాలు తోటి మానవ జాతికి సిగ్గుచేటు. ఈ రెండు దేశాల మధ్య జరుగుతున్న నరమేధాన్ని ప్రపంచ దేశాలు ఆపటానికి ప్రయత్నించకపోవటం, ఐక్యరాజ్య సమితి కూడా చేష్టలుడిగి చేతులెత్తేయ్యటం ఫలితంగా దాని మనుగడే ప్రశ్నార్థకం అయినది. కక్షతో కానిది– కక్షతో సాధించనిది క్షమాభిక్షతో సాధించాలి, కత్తితో ఛేదించనిది కరుణతో ఛేదించాలి అంటాడు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత.

రష్యా దేశమైనా, ఉక్రెయిన్ దేశమైనా, ఇజ్రాయిల్, అయినా పాలస్తీనా ఐనా, నైజీరియా ఐనా, జర్మనీ ఐనా, లిబియా ఐనా, ఏ దేశంలోనైనా పిల్లలే వుంటారు. పిల్లలు లేని ప్రపంచాన్ని ఊహించగలమా...?

స్వేచ్ఛగా ఎగరాల్సిన బాల్యాన్ని వారి రంగు రంగుల ప్రపంచాన్ని పెద్దలుగా మనం ఎలాంటి సమాజాన్ని వారికి భవిష్యత్‌లో కానుకగా ఇస్తున్నాం, "ఎగరకుండా రెక్కలు తెంచి" వదిలివేస్తే ఎక్కడికి వెళ్ళగలరు వారు? యుద్ధాల ద్వారా, హింసాత్మక సంఘటనల ద్వారా బాల్యాన్ని అణచివేస్తే, చిదిమివేస్తే వారి తాలూకు వారు పెరిగి పెద్దవారై వాటికి ప్రతీకారం కోరుకోరా? ఒకవేళ అలా జరిగితే ప్రపంచంలో శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయి? భవిష్యత్‌లో శాంతియుతమైన సమాజాన్ని పెద్దవారుగా మనం ఎలా ఆశించగలం? నేటి పిల్లలే రేపటి పెద్దవారిగా ఎదుగుతారు. మనం ప్రస్తుతం తప్పుచేసి వారికి బాల్యంలో శాంతియుతమైన సమాజాన్ని అందివ్వకుండా భవిష్యత్తులో వారి నుండి శాంతియుత సమాజాన్ని ఆశించ గలమా? ఓ ''హిట్లర్'' నరమేధం చరిత్ర గతిని మారిస్తే యుద్ధ వాతావరణంలో పెరిగిన పిల్లలు భవిష్యత్తులో దేశాధ్యక్షులు, మరో హిట్లర్ మాదిరిగా ప్రవర్తిస్తే సమాజం శాంతియుతంగా ఉంటుందా? అలాగే చిన్న పిల్లల పట్ల నరమేధం సృష్టిస్తే సమాజం ఏమైపోతుంది? నిత్యం బాంబులు, హింసాత్మక సంఘటనల మధ్య పెరిగిన బాల్యం పెరిగి పెద్దయిన తర్వాత మళ్ళీ హింస వైపు మళ్లదని ఎవరైనా హామీ ఇవ్వగలరా? "రెక్కలు తెగిన బాల్యాన్ని" ఎవరైనా కోరుకుంటారా?

ఓ కుటుంబంలో మానసిక వికలాంగుడిగానో, శారీరక వైకల్యంతోనో అమ్మాయో, అబ్బాయో పుడితే ఆ తల్లిదండ్రులు అనుభవించే బాధ నరకం కన్నా ఎక్కువ, మరి అలాంటిది యుద్ధాలలో గాయపడిన "చనిపోయిన పిల్లల్ని తల్చుకుంటూ ఆ తల్లిదండ్రులు పడే ఆవేదనను అర్థం చేసుకోలేకపోతే సాటి మనుషులుగా మనం ఎందుకున్నట్లు? ఎవరు ఎటుపోతేనేం మనం సురక్షితంగా ఉన్నాం అనుకోవడంలో అర్థం లేదు. ఆ పిల్లల ద్వారా భవిష్యత్తులో హింస జరిగితే దానికి బాధ్యత వహించాల్సింది మనమే కదా! పెద్దలుగా మనం పిల్లల్ని ఎటు తీసుకొని వెళ్తున్నాం ఏ వాతావరణాన్ని వారికి మనం కానుకగా ఇస్తున్నాం అనేది ఆలోచించాలి.

"చిన్నారులు సామూహికంగా కలుసుకుంటారు
అనంత విశ్వసాగర తీరంలో
పైన గగనం దిగువ అలల అలజడిలో కదలి
పిల్లలెప్పుడూ ఆడుతూ, పాడుతూ
నవ్వుతూ, నర్తిస్తూ పోగవుతారు
తీరంలోని ఇసుకతో గూళ్ళుకట్టి
ఆటలాడుతారు గవ్వలతో
సాగరంలో ఎండుటాకులనే
పడవలుగా వదిలి నవ్వుతుంటారు
చిన్నారులు ఆడుకుంటారు
అనంత విశ్వసాగర తీరంలో" అంటూ

"రంగుల బాల్యాన్ని" వర్ణించాడు "విశ్వకవి" రవీంద్రుడు. పిల్లల మొఖంలో ఎప్పుడూ ఆనందాన్నే కోరుకుందాం, ఎలాంటి అలజడి లేని సమాజాన్ని వారికి కానుకగా ఇవ్వడానికి మన వంతుగా ప్రయత్నం చేద్దాం ఎక్కడ మనస్సు నిర్భయంగా ఉంటుందో, ఎక్కడ జ్ఞానం స్వేచ్ఛాయుతంగా ఉంటుందో అటువంటి సమాజాన్ని నిర్మించి పిల్లలకు అందిద్దాం. ✤



# సమస్త ప్రాణులకు నీరే ఆధారం



**- ముహమ్మద్ వహీదుద్దీన్, సిద్దిపేట**

**నీరు ప్రాణాధారం.** భూమిపై నీరు లేకుంటే ఏ జీవరాశి కూడా బ్రతకడం చాలా కష్టం. నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలి. మనం అలా చేయడం లేదు. విచ్చలవిడిగా నీటిని వృధా చేస్తున్నాము. దీని వలన భూగర్భ జలాలు అడుగంటిపోతు న్నాయి. రాబోయే తరాలకు నీరు లభించడం చాలా కష్టం. నీటిని కలుషితం కాకుండా చూసుకోవాలి. దురదృష్టవశాత్తూ కొన్ని శతాబ్దాల నుంచి నీరు కలుషితమవుతోంది.

గాలి కాలుష్యం వల్ల వర్షపు నీరు విషపూరిత రసాయనాలతో నదులు, సముద్రాలు, చెరువులు, వాగులు, కుంటలు కలుషితమవుతున్నాయి. దీనివల్ల భూగోళం మీద పరిశు ద్ధమైన నీరు, ఆహారం వనరులుగా మిగిలి ఉండవు! ఈ కలుషిత నీటి వల్లనే అనేక రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. నీరు ఆరోగ్య పరిరక్షణకూ, వ్యవసాయానికీ, పరిశ్రమలకూ అనివార్యమైంది. స్పష్టంగా చెప్పాలంటే నీరు ఈ భూగోళానికి, అందులోని జీవులకూ చాలా కీలకమైనది! నీటి పరిరక్షణకు ఇస్లామ్ ధర్మంలో ఎన్నో సూచనలున్నాయి. ఇస్లాం ధర్మం ఈ అంశాన్ని చాలా ముఖ్యాంశంగా పరిగణిస్తుంది.

అంతిమ దైవ గ్రంథం దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చారు:

(మీరు ప్రతి వర్షాకాలంలోనూ చూస్తారు), అల్లాహ్ ఆకాశం నుండి నీళ్ళను కురిపించాడు. నిర్జీవంగా పడివున్న భూమిలో ఒక్కసారిగా దాని ద్వారా ప్రాణం పోశాడు. నిశ్చయంగా ఇందులో వినేవారికి ఒక నిదర్శనం ఉన్నది.

(దివ్యఖుర్ఆన్ 16 : 65)

"ప్రాణం ఉన్న ప్రతి దానినీ నీళ్లతో సృష్టించామనీ? వారు (సృష్టించే మా ఈ శక్తిని) అంగీకరించరా?"

***(దివ్యఖుర్ఆన్ 21 : 30)***

అల్లాహ్ ప్రతి ప్రాణిని ఒక విధమైన నీటితో సృష్టించాడు. ఒకటి పొట్టపై నడుస్తుంటే, మరొకటి రెండు కాళ్లపై, ఇంకొకటి నాలుగు కాళ్ళపై నడుస్తోంది. ఆయన తనకు ఇష్టమైన దానిని సృష్టిస్తాడు. ఆయనకు ప్రతి దానిపై అధికారం ఉన్నది.

***(దివ్యఖుర్ఆన్ 24 :45)***

ఆయనే నీటితో మానవుణ్ణి సృష్టించాడు. తరువాత అతని ద్వారా(తన) వంశము, అత్తవారి వంశము అనే రెండు వేర్వేరు బంధుత్వపు క్రమాలను రూపొందించాడు. నీ ప్రభువు సర్వశక్తి సంపన్నుడు. ***(దివ్యఖుర్ఆన్ 25 :54)***

## నీటిపై సింహాసనం

ఆకాశం నుండి మేము సరిగ్గా లెక్క ప్రకారం ఒక ప్రత్యేక పరిమాణంలో నీటిని దింపాము, దానిని భూమిలోపల నిలువచేశాము. మేము దానిని ఎలా కోరితే అలా మాయం చేయగలం. ***(దివ్యఖుర్ఆన్ 23 :18)***

## మంచినీరు - ఉప్పునీరు

ఆకాశాలనూ, భూమినీ ఆరు దినాలలో సృష్టించినవాడు ఆయనే - దానికి పూర్వం ఆయన సింహాసనం నీళ్ళపై ఉండేది. ***(దివ్యఖుర్ఆన్ 11 : 7)***

రెండు సముద్రాలనూ కలిపి ఉంచినవాడు ఆయనే. ఒకటేమో రుచికరమైనది, మధురమైనదీను. రెండోది చేదైనది, ఉప్పైన దీను. ఆ రెంటి మధ్య ఒక తెర అడ్డంగా ఉన్నది. అది వాటిని కలసిపోకుండా ఆపి ఉంచే అవరోధం.

***(దివ్యఖుర్ఆన్ 25 :53)***


నీటి వనరులు రెండూ సమానం కావు; ఒకటేమో తియ్యనిది, దప్పికను తీర్చేది, త్రాగటానికి మధురమైనది. రెండోదేమో గొంతు మండించే అంత ఉప్పునిది. ***(దివ్యఖుర్ఆన్ 35 :12)***

నీటి పొదుపు విషయంలో అంతిమ దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

"నీటిని వృధా చేయకండి. మీరు ప్రవహిస్తున్న నీటి తీరాన ఉన్నా సరే !"

చెరువులో మంచినీరు నిల్వ ఉన్న చోట, ప్రవహిస్తున్న నదులు, కాలువలు వున్న చోట మలమూత్ర విసర్జన చేయటాన్ని ప్రవక్త (స) నిషేధించారు.


అంతిమ దివ్యఖుర్ఆన్, అంతిమ దైవప్రవక్త (స) యొక్క అనేక హదీసులు, ప్రవచనాలు, ఉల్లేఖనాలు నీటి స్వచ్ఛతను కాపా డటం, దాని సంరక్షణ చాలా ముఖ్యమని స్పష్టం చేశాయి. ✤



# అరుదైన పత్రికా రచయిత, కవి దేవిప్రియ

(ఆగస్టు 15 దేవిప్రియ జయంతి)

యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్




**దేవిప్రియ** – తెలుగు సాహిత్యాభిలాషులకు ఏమాత్రం పరిచయం అఖ్ఖరలేని పేరు. సుప్రసిద్ధ కవి, రచయిత, సంపాదకులు, గేయ రచయిత, సినిమా రచయిత, పలు రంగస్థల నాటకాల సృష్టికర్త, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, పైగంబర కవుల్లో ప్రసిద్ధుడు, చేకూరితో 'చేరాతలు' రాయించినా, శ్రీశ్రీతో అనంతం రాయించినా అది ఆయనకే చెల్లింది. ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు, ఆంగ్ల సాహిత్య రంగాలను ఒంటి 'పెన్ను'తో ఏలిన ఘనుడు. దేవిప్రియగా ప్రసిద్ధుడైన ఈయన అసలు పేరు షేక్ ఖాజా హుస్సేన్. 1949 ఆగస్టు 15వ తేదీన గుంటూరు జిల్లా తాడికొండ గ్రామంలో జన్మించారు. షేక్ హుసేన్ సాహెబ్, ఇమామ్ బీ తల్లిదండ్రులు. ప్రాథమిక విద్య తాడికొండ, వినుకొండల్లో సాగింది. గుంటూరులోని ఏ.సీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. చిన్నతనం నుంచే చదువు పట్ల, రచనల పట్ల మక్కువ, ఆసక్తి కలిగిన దేవిప్రియ కళాశాల రోజుల్లోనే కవితలు, గేయాలు రాసే వారు. షుమారు పద్నాలుగేళ్ళ వయసులోనే కథలు రాయడం మొదలుపెట్టారు. నిర్మల, జ్యోతి, ప్రజాతంత్ర, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఉదయం పత్రికల్లో పాత్రికేయునిగా పని చేశారు. స్వయంగా 'మనోరమ' వారపత్రిక నడిపారు. హైద్రాబాద్ మిర్రర్ వ్యవస్థాపక సంపాదకులుగా బాధ్యతలు నిర్వహించారు. వ్యంగ్యం, విమర్శనాత్మకం కలగలిపి పాఠకులను ఉర్రూతలూగించిన వ్యంగ్య కార్టూన్ మినీ కవిత 'రన్నింగ్ కామెంటరీ' దేవిప్రియ సృష్టే. సమకాలీన రాజకీయ, సాంఘిక, సామాజిక అంశాలపై ఎక్కుపెట్టిన పదునైన వ్యంగ్య బాణాలు. ఆయన రాసిన 'గాలిరంగు' కవితా సంపుటికి 2017లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. సినిమా రంగంపై కూడా దేవిప్రియ సాధికారమైన వ్యాసాలు రాశారు. 'దాసి', 'రంగులకల' తదితర చిత్రాలకు పాటలు రాశారు. దర్శకత్వం వహించారు. ఆయన రాసిన కవితా సంపుటులు వేటికవే సాటి. సమాజానందస్వామి, గరీబు గీతాలు, అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫాను తుమ్మెద, పిట్టకూడా ఎగిరి పోవలసిందే, చేపచిలుక, అరణ్య పురాణం, తదితర కవితా సంపుటులు మచ్చుకు కొన్ని. రన్నింగ్ కామెంటరీ మూడు సంపుటులు నడుస్తున్న చరిత్రకు అద్దం పడతాయి. ఇన్షాఅల్లాహ్ అన్న పద్యకావ్యం ఆయన లోని తాత్వికతకు అద్దం పడుతుంది. 'అధ్యక్షా మన్నించండి' అంటూ దేవిప్రియ సంధించిన శరపరంపరా సంపాదకీయాలు ఎంతటి వారినైనా ఆలోచించేలా చేసి, కర్తవ్యదీక్ష వైపు ప్రేరేపిస్తాయి. 1995 ప్రాంతంలో హైదరాబాద్ కేంద్రంగా వెలువడుతున్న 'గీటురాయి' వార పత్రికలో, ఆ పత్రిక ప్రధాన సంపాదకులు ఎస్.ఎమ్. మలిక్‌తో కలసి పని చేశారు. గీటురాయి పత్రికకు కొత్తరంగులు అద్దడంలో దేవిప్రియ కృషి మరువలేనిది. 'ఇంకా ఉంది', 'చివరిపేజీ'ల పేరుతో గీటురాయి పత్రికలో దేవిప్రియ నిర్వహించిన కాలమ్ చిరస్మరణీయం. రన్నింగ్ కామెంట్రీ లాగానే గీటురాయిలో 'వారేవా' పేరుతో కార్టూన్ మినీ కవిత ప్రారంభించింది దేవిప్రియే. అది నేటికీ నిరాటంకంగా కొనసాగుతోంది. దాన్ని కొనసాగించడాన్ని నేను గర్వంగా భావిస్తున్నాను. **పురస్కారాలు:** 1980లో అమ్మచెట్టు కవిత్వానికి ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, 1991లో నీటిపుట్ట కవితా సంకలనానికి సినారె కవితా పురస్కారం, 2001లో కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారం తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం, 2017లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి. ఏది ఏమైనా సాహిత్యమే శ్వాసగా జీవించిన దేవిప్రియ (ఖాజా హుసైన్) లాంటి కవులు చాలా అరుదుగా పుడతారు. ✤

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది        ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

51 – 52 ఒకరోజున ఫిర్ఔన్ తన జాతి మధ్యన ఎలుగెత్తి చాటాడు,[45] "జనులారా! ఈజిప్ట్ పరిపాలన నా స్వంతం కాదా, ఈ కాలువలు నా అధీనంలో పారడం లేదా? మీకు (ఇదంతా) కానరావడం లేదా?[46] నేను ఉత్తముణ్ణా లేదా ఈ నీచుడు, అథముడయిన వ్యక్తియా?[47] మరేమో ఇతను తన మాటను సయితం స్పష్టంగా విడమర్చి చెప్పజాలడే?[48] ఇతనికి సువర్ణ కంకణాలు ఎందుకు అవతరించలేదు? లేదా దైవదూతల ఒక దళం ఇతని బంట్రోతుగా ఎందుకు రాలేదు?"[49]

45. బహుశా మొత్తం జాతిలో చాటింపు వేసే ఆచరణాత్మక విధానం ఇదయి ఉంటుంది: ఫిర్ఔన్ తన దర్బారులో పరిపాలనా అధికారులు, నాయకులు, జాతికి చెందిన పెద్ద పెద్ద వారిని సంబోధించిన విషయాన్నే చాటింపు వేసే వారి ద్వారా దేశం మొత్తాన గల మహా నగరాలలో, పట్టణాలలో, గ్రామాలలో ప్రకటించి ఉంటారు. పాపం వారి దగ్గర నేటి సాధనాలు లేకపోయాయి. పొగడ్తలు కురిపించే ప్రెస్సు, ప్రభుత్వ పబ్లిసిటీ ఏజెన్సీలు, అధికార రేడియోలు తదితర ప్రచార ప్రసారాల మాధ్యమాలు లేకపోయాయి.

46. చాటింపు వాని ఈ ప్రకటన వల్లనే తేలిపోతోంది, హిస్ మెజెస్టీ వారి చాప కింద నీళ్ళు వచ్చేశాయని. మహనీయ మూసా (అ) చూపించిన నిరంతర మహిమల వల్ల దేశంలో సాధారణ ప్రజల నమ్మకం తమ దేవతల ఎడల డోలాయమానమయిపోయింది. ఫిర్ఔనులు నిర్మించుకున్న ఇంద్రజాల వలయమంతా భగ్నమయిపోయింది. దాని ద్వారా ఆ వంశావళి దేవతల అవతారాలయి, ఈజిప్ట్‌లో తమ దైవత్వాన్ని చెలాయించుకునేది. ఈ పరిస్థితిని చూసే ఫిర్ఔన్ ఎలుగెత్తి అరిచాడు, దౌర్భాగ్యులారా, మీకు ఏమీ కానరావడం లేదా, ఈ దేశంలో రాచరికం ఎవరిది సాగుతున్నదో, నైలునది నుండి బయలుదేరిన ఈ కాలువల నీటిపైన్నే కదా మీ ఆర్థిక స్థోమత అంతా ఆధారపడి ఉంది, ఇవి ఎవరి ఆదేశానుసారం పారుతున్నాయి? ఈ అభివృద్ధి (Development) పనులన్నీ నేనూ నా వంశంలోని వారు చేసినవేగా, అయినా మీరేమో ఈ ఫకీరు కోసం పడిచస్తున్నారు.

47. అంటే, ఎవరి వద్దనయితే ధనం, సిరిసంపదలు లేవో, అధికారం, హోదాల్లేవో అతను అన్నమాట. ఇదీ కురైష్ తిరస్కారులు దైవ సందేశహరులు (స) పైన లేవనెత్తిన అభ్యంతరమే.

48. కొందరు వ్యాఖ్యాతలు ఫిర్ఔన్ చేసిన ఈ ఆక్షేపణ, హజ్రత్ మూసా నోటికి చిన్నప్పటి నుంచి ఉన్న నత్తికి సంబంధించింది అని తలపోశారు. కాని ఈ అభిప్రాయం సరయినది కాదు. తాహా సూరాలో ఉంది, మహనీయ మూసాకు దైవదౌత్య బాధ్యతల నప్పగించేటప్పుడు ఆయన పరమ ప్రభువును అభ్యర్థించారు, 'నా నోటికున్న ముడిని విప్పండి, తద్వారా జనులు నా మాటను సవ్యంగా బోధపరచుకోగలుగు తారు' అని. అప్పుడే ఆయన చేసిన ఇతర అభ్యర్థనలతో పాటు ఈ అభ్యర్థననూ స్వీకరించడంలో జరిగింది (ఆయత్ 27–36). అంతేకాక దివ్య ఖుర్ఆన్ విభిన్న చోట్ల మహనీయ మూసా చేసిన ప్రసంగాలను ఉటంకించడం జరిగింది. అవన్నీ పరిణతి చెందిన వాక్పటిమను చాటుతున్నాయి. కనుక ఫిర్ఔన్ చేసిన అభ్యంతరానికి ఆ మహనీయునికున్న ఏదో నత్తి కారణం కాదు. దీని భావం, ఈ వ్యక్తి ఏమిటేమిటో చిక్కుబడిన విషయాలు చెబుతుంటాడు. మా మహా సమ్ముఖంలో అనేవీ ఈయనగారి ఉద్దేశమేమిటో ఎన్నడూ బోధపడలేదు.

49. ప్రాచీన కాలంలో ఎవరినయినా ఒక ప్రాంతానికి గవర్నరుగానో, లేదా విదేశాలకు రాయబారిగానో నియమించినప్పుడు రాజుగారి తరఫున అతనికి విశేష బహుమానాలు అందజేయబడేవి. వాటిలో బంగారు కడియాలు, లేదా కంకణాలు కూడా ఉండేవి. దానితో పాటు సైనికులు, బంట్రోతులు, సేవకుల ఒక దళం కూడా ఉండేది. తద్వారా అతని ఠీవీ, హుందాతనం, భయోత్పాతం నెలకొనాలని, అతన్ని నియమించిన రాజుగారి వైభవ ప్రాభవాలు కూడా వెల్లడి కావాలని అలా జరిగేది. ఫిర్ఔన్ భావమేమిటంటే, మూసాని నిజంగానే ఆకాశాల చక్రవర్తి మా వద్దకు తన రాయబారిగా పంపి ఉన్నట్లయితే ఇతనికి రాజదర్బారు కిరీటం, వస్త్రాలు ప్రాప్తించి ఉండేవి, దైవదూతల దొంతరలు ఇతనితో పాటు వచ్చి ఉండేవి, ఇదేమిటీ, ఒక ఫకీరులాంటి వ్యక్తి వచ్చేసి చేతిలో ఒక కర్ర పట్టుకుని, నేను విశ్వ ప్రభువుకు సందేశహరుణ్ణి అని అంటున్నాడు? అన్నది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం

(కితాబుల్ మగాజీ)

### బద్ర్ సమర క్షేత్రంలో....

**587)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్(సఅసమ్); "అబూ జహ్లాకు పట్టిన గతేమిటో తెలుసుకునే వారెవరు?" అని అడిగినప్పుడు, ఇబ్నె మస్ఊద్(రజి) నిజ స్థితిని తెలుసుకునేందుకు వెళ్ళారు. అఫ్రా కొడుకులు ఇద్దరూ (ముఅజ్, మవూజ్) అతనిని వధించి ఉండటం గమనించారు. అప్పటికే అతని శరీరం చల్లబడిపోయింది. 'అబూ జహ్లావి నువ్వేనా?'[1] అని ఆయన అడిగారు. అనస్(రజి) ఇలా అన్నారు: ఇబ్నె మస్ఊద్ (రజి) అతని గడ్డం పట్టుకున్నారు. 'ఈ రోజు నీవు వధించిన వారిలో ఇతని (నా) కన్నా గొప్పవాడెవడయినా ఉన్నాడా?' అని అబూ జహ్లా అడిగాడు లేదా అతనిలా అన్నాడు: 'తన జాతివారు వధించిన వారిలో ఇతనికన్నా గొప్పవాడెవడయినా ఉన్నాడా?'

**588)** హజ్రత్ అనస్(రజి) కథనం: బద్ర్ యుద్ధ దినాన ప్రవక్త మహనీయులు (సఅసమ్) తన సహచరులనుద్దేశించి, "అబూజహ్లా సంగతి తెలుసుకుని వచ్చేవారు మీలో ఎవరు?" అని అడిగినప్పుడు, ఇబ్నె మస్ఊద్(రజి) అతని సంగతి తెలుసుకుని రావడానికి వెళ్ళారు. అఫ్రా కుమారులిద్దరూ అతన్ని వధించి ఉండటాన్ని ఆయన గమనించారు. అబూ జహ్లా శరీరం చల్లబడుతోంది. ఆయన అతని గడ్డాన్ని పట్టుకుని, 'అబూ జహ్లావి నువ్వేనా?' అని అడిగారు. దానికి అతను, 'తన జాతి వారిచేత వధించబడిన వారిలో ఇతనికన్నా గొప్పవాడెవడయినా ఉన్నాడా?'[1] అని చెప్పాడు. లేదా 'మీరంతా కలసి అతన్ని చంపేశారా?' అన్నాడు.

**589)** అలీ బిన్ అబీ తాలిబ్(రజి) తెలిపారు: ప్రళయదినాన అల్లాహ్ దర్బారులో వివాదాన్ని పరిష్కరించడానికి రెండు బాహువుల్ని ఆనించి కూర్చునే మొట్టమొదటి వ్యక్తిని నేనే[1]. ఈ మహానుభావుల (హమ్జా, అలీ, ఉబైదా– రజిఅల్లాహు అన్హుమ్‌ల) గురించి అల్ హజ్జ్ సూరాలోని ఈ ఆయత్ అవతరించిందని ఖైస్ బిన్ ఉబాద్ తెలియజేశారు. "ఆ ఇరువర్గాల వారు తమ ప్రభువు విషయంలో ఘర్షణ పడ్డారు (22: 19). అంటే బద్ర్ యుద్ధం జరిగిన రోజున ఆ ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు ముఖాముఖీ అయ్యారు. ముస్లింల తరపున హమ్జా, అలీ, అబూ ఉబైదా బిన్ హారిస్ (ర.అన్హుమ్) ముందుకు వస్తే, అవిశ్వాసుల పక్షాన షైబా బిన్ రబీయ, ఉతబా, వలీద్ బిన్ ఉతబా ముందుకు వచ్చారు.

587-1. ఇబ్నె మస్ఊద్(రజి) మక్కాలో ఉన్నప్పుడు అబూ జహ్లా చేత తీవ్రంగా హింసించబడ్డారు. బద్ర్ యుద్ధ మైదానంలో ఆ దౌర్జన్య పరుడు ఇద్దరు టీనేజీ కుర్రాళ్ళ చేతిలో చావు దెబ్బతిని పడి ఉండటాన్ని ఇబ్నె మస్ఊద్ (రజి) కళ్ళారా చూశారు. అతని గడ్డం పట్టుకుని 'నువ్వేనా అబూ జహ్లావి?' అని ప్రశ్నించారు. నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు కుప్పకూలినట్లుగా బద్ర్ యుద్ధంలో అబూ జహ్లా కథ సమాప్తం అయింది.

588-1. చింత చచ్చినా పులుపు చావదన్నట్లు, అవమానకరమయిన చావును చవిచూసే సమయంలో కూడా అబూ జహ్లాలోని గర్వాహంకారం చావలేదు. వేరొక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఇబ్నె మస్ఊద్(రజి), అబూ జహ్లా మరణవార్త తెలియజేసినప్పుడు దైవప్రవక్త(స) దైవానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. "ఈ ఉమ్మత్‌లోని ఫిరౌన్ వధించబడ్డాడ"ని అన్నారు.

589-1. అసలేం జరిగిందంటే, యుద్ధం మొదలవడానికి ముందు సత్య తిరస్కారుల పక్షాన ముగ్గురు వ్యక్తులు యుద్ధ రంగంలో ముందుకు వచ్చి 'ఓ ముహమ్మద్(స)! మాతో యుద్ధం చేయడానికి జనులను పంపించు' అని సవాలు విసిరారు. వారి కోరికపై ముగ్గురు అన్సారులు వెళ్ళారు. కాని వారు అన్సారులతో తలపడటానికి నిరాకరించారు. మేము మాకు సమ ఉజ్జీలైన ఖురైషులతో మాత్రమే పోరాడతామని అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స), "హమ్జా అలీ, ఉబైదా! లేవండి" అని పురమాయించారు. హమ్జా షైబాకు ఎదురుగా, అలీ వలీద్‌కు ఎదురుగా నిలబడ్డారు. హమ్జా షైబాను వధించగా, అలీ వలీద్‌ను కడతేర్చారు. మరోవైపు ఉబైదా-ఉతబా లిద్దరూ పరస్పరం కత్తులు దూసుకుంటున్నారు. హజ్రత్ అలీ వెళ్ళి ఉతబాను వధించి, ఉబైదాను తీసుకుని వచ్చారు.

✤

# భారతీయ సమాజంలో సత్య సందేశం-2

- ఎస్.ఎమ్.మలిక్

**(గత సంచిక తరువాయి)**

వాస్తవానికి ఈ ఇస్లామీయ సందేశ కృషియే ముస్లిమ్ సముదాయానికి దైవం పక్షాన అప్పజెప్పబడిన నిజమయిన విధ్యుక్త బాధ్యత.

> **ఈ విధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సముదాయంగా చేశాము. దైవ సందేశహరులు ఏ విషయానికి మీ సమక్షంలో సాక్ష్యం ఇచ్చారో దానికి మీరు మానవాళి మధ్యన సాక్షులుగా నిలువాలని. (అల్ బకర : 143)**

మరోచోట :

> **ఇక మీరే ప్రపంచంలో అత్యుత్తమమయిన సమాజం. మిమ్మల్ని జనుల మార్గబోధనకు రంగంలోకి తేవడం జరిగింది. మీరు మంచిని ప్రేరేపిస్తారు, చెడు నుండి వారిస్తారు, దైవాన్ని విశ్వసిస్తారు. (ఆలె ఇమ్రాన్ : 110)**

ఈ సందేశాన్ని మానవాళికి అందజేయడం ముస్లిమ్ సముదాయం నిజ లక్ష్యం అని ఈ దైవ వచనాలు ఘంటాపథంగా చాటుతున్నాయి. భారతదేశ వైవిధ్య స్వరూపంలో ఈ సందేశం అందజేయాలనుకుంటే ఇక్కడి వాతావరణాన్ని ఈ సందేశానికి సానుకూలమయినది (Conducive)గా మలిచే ప్రయత్నం చేయడం ప్రప్రథమ ఆవశ్యకత. ఎందుకంటే ఈ సందేశాన్ని ప్రజల ముందు ఎన్నడు అందజేసినా వ్యతిరేకతే ఎదురయింది. అయితే ఈ సానుకూల పరిచే కృషి ఎలా జరగాలి? ఈ సందేశానికి కడపడి ధ్వజవాహకులు మహనీయ ముహమ్మద్(స) జీవన కృషిలోనే మనం నెరిపే సందేశాత్మక కృషికి అత్యుత్తమ ఆదర్శం ప్రాప్తమవుతుంది :

1. ప్రవక్త(శ్రీ(స) జీవితం, సందేశ ప్రదానం రీత్యా అహింసా ప్రధానమయింది (Non Voilence). ఈ మాట బహుశా చాలా మందికి విచిత్రంగా అనిపించవచ్చు. కాని వాస్తవం ఇదే. ఆయన అనుయాయులు మహనీయ బిలాల్, ఖబ్బాబ్, యాసిర్, సుమయ్య(ర) పట్ల మక్కా వాసులు అవలంబించిన వైఖరి, స్వయంగా ఆయన పట్ల ప్రతీ నాయకులు నిర్వహించిన పాత్రను పరికిస్తే చాలు అంతా ద్యోతకమయిపోతుంది.

2. ప్రవక్త(శ్రీ ప్రత్యర్థులతో శాంతియుత వాతావరణాన్ని నెలకొలిపేందుకు, దైవాదేశం మేరకు, ఇరువర్గాల మధ్య సమానంగా అంగీకృతి పొందగల అంశం (Common Point) కోసం తీవ్రంగా అన్వేషించారు.

గ్రంథవహులారా! మీరూ మేమూ సమానంగా సమ్మతించే విషయానికి ముందుకు రండి. (ఆలె ఇమ్రాన్ 3: 64)

3. వ్యతిరేక, శత్రుత్వ, సంఘర్షణాపూర్వకమయిన (Hostile, Cofrontational) వాతావరణాన్ని సానుకూల వాతావరణంగా రూపొందించడానికి ఆయన(స) అనేక విధాలా ప్రయత్నించారు. ఆ సందర్భంలోనే ముతి'మ్ బిన్ అదీ వంటి సుహృదయాల్ని, తనకు అండగా, సహాయ సహకారాలు అందజేసేవారుగా మలచుకునే ప్రయత్నాలు ముమ్మరంగా చేశారు. తాను తన యవ్వనంలో పాల్గొన్న ఓ ఒప్పందం 'హిల్ఫుల్ ఫుజూల్' వంటి కార్యక్రమంలో పాల్గొనడానికి తాను నడి వయసులో ఉన్నప్పుడు కూడా తన సన్నద్ధత వ్యక్తపరిచారు.

4. సాధ్యమయినంత మేర అలీనం (Non Alisned)గా ఉండే వ్యక్తులను వెతికి వారి సహాయ సహకారాన్ని కోరేవారు ప్రవక్త(శ్రీ(స). ఆ క్రమంలోనే తన సందేశాన్ని స్వీకరించకపోయినా, తన బాబాయి అబూ తాలిబ్ అండతో చాలాకాలం వరకు తన సందేశాన్ని జన బాహుళ్యంలో వ్యాప్తి కొరకు కృషి చేశారు.

ఆ సందర్భంలోనే, మహనీయ ఖదీజా, అబూ తాలిబ్‌ల నిష్క్రమణ తరువాత తాయిఫ్ నగరంలో తనకు మరో కేంద్రం ప్రాప్తమవుతుందేమోనని వెళ్ళి అక్కడ ఒక నెల రోజులు గడిపి అక్కడి అనేక తెగల నాయకులకు సందేశాన్ని వినిపించారు. కాని వారు ఎవరూ సందేశాన్ని స్వీకరించలేదు. కనీసం శత్రుత్వ వాతావరణాన్ని అంతమొందించేందుకు సహాయపడమని కోరారు. దానికీ వారు అంగీకరించలేదు. ఇక అది సాధ్యం కాదని నిరూపితమయిన తరువాత ముతి'మ్ బిన్ అదీ ఆశ్రయం పొందే ప్రయత్నం కూడా చేశారు. దాన్ని కడకు సాధించగలిగారు.

ఇవీ ఆయన చేసిన ప్రయత్నాల నమూనా.

## మన దేశంలో

వెనుకటి పుటల్లో నివేదించుకున్నట్లు మన దేశంలో ఎన్నెన్నో చెడుగులు దారి చేసుకున్నప్పటికీ దేశవాసులు దైవ తిరస్కారులు, దైవ విరోధులూ కారు. పరలోక జీవితం, ఈ జీవితం తరువాత మరో జీవితం కలదన్న భావననూ కాదన్న వారు కారు. పరలోక స్పృహ కలవారే. అందువల్ల వీరి పట్ల నిరాశ చెందనవసరం లేదు.

మానవ ఆత్మను గురించి దివ్య ఖుర్‌ఆన్ ఇలా వక్కాణిస్తుంది:

"(మానవ ఆత్మలో) దాని చెడుగును, ఇంకా దాని చెడుల నుండి తప్పించుకునే గుణాన్నీ (దైవం) దాని (అంతర్యంలో) పొందుపరిచాడు". (అష్ షమ్స్ 91 : 8)

దీన్నిబట్టి మానవ ఆత్మలో రెండు గుణాలు ప్రోది చేయటం జరిగింది. ఒకటి దేవుని అవిధేయత (Transgression) లేదా తిరుగుబాటు. రెండవది, దేవుని విధేయత (Submission). దైవాన్ని నమ్మేవారి బాధ్యత మానవునిలోని ఈ మంచిని ప్రేమించే లేదా దైవ విధేయత కనబరిచే విధానాన్ని వికసింపజేయడం. అంతర్యం దైవం వైపునకు మొగ్గేలా ప్రేరణ కల్పించడం. ఓ విధంగా ఈ భావం మనిషిలో దైవం తరపున నియోగించబడిన రాయబారి. ఈ రాయబారిని ఉత్తేజపరచాలి. మంచి వైపునకు ప్రేరేపించాలి. దైవభక్తి భావాన్ని నిజమయిన కోణంలో నిజమార్గం వైపునకు మరలించాలి. అలాగే పరలోక చింతనను దాని నిజమయిన రూపంలో బోధపరచాలి. ఇంకా మానవ జీవితంలో దైవమార్గ బోధన, దైవ మార్గదర్శకత్వం ఆవశ్యకతను ప్రాధాన్యతను ప్రస్ఫుటపరచాలి. ఇదే ముస్లిముల ప్రథమ కర్తవ్యం.

## దేశవాసులు

మనదేశంలో సాధారణ జనాభాలో ఓ పెద్దసంఖ్య ఇస్లామ్‌ను గురించి, ముస్లిముల్ని గురించి అనేక అపోహలకు, అపార్థాలకు గురయి ఉంది. ఈ అపోహలు, అపార్థాలు నేటివి కావు. వీటి వెనుక ఓ పెద్ద చరిత్ర ఉంది. ఇంకా వీటిలో ఇతర అనేక శక్తులు వ్యాపింపజేసినవీ ఉన్నాయి. స్వయంగా ముస్లిముల తప్పిదాలు, లోపాలు, కొరతల వల్ల ఏర్పడ్డవీ ఉన్నాయి. వీటిని దూరం చేసే నిరంతర కృషి అవసరం. దానికి ముస్లిమేతర సోదరుల-ముస్లిముల మధ్య సుహృద్భావ సంబంధాలు ఏర్పడటం, అవి గట్టిపడటం, పెంపొందడమూ అవసరమే.

ఈ అపోహలూ అపార్థాలు ఎలా సమసిపోతాయి? దీనికిగాను ముస్లిములు వారికి చేరువ కావలసి ఉంది. మైత్రీ సంబంధాలు, సోదర సంబంధాలు ఏర్పరచుకోవలసి ఉంది. వాటిని పెంపొందించుకోవడం అవసరం. అప్పుడే పరిస్థితులు సందేశానికి సానుకూలమవుతాయి. కనీసం శత్రుత్వం లేని విధంగానయినా మారుతాయి.

అబూ తాలిబ్‌లా, ము'తిమ్ బిన్ అదీలా మనకు వెన్నుదన్నుగా నిలిచేవారిని లేదా కనీసం మరే శత్రు శక్తితోనూ ఏకీభవించినవారు (Committed) కాకపోయినా అటువంటి వారిని అన్వేషించి, గుర్తించి (Identify) పరిస్థితుల్ని, వాతావరణాన్ని సానుకూలమయినవిగా, కనీసం శత్రుత్వ భావం లేనివి (Non Hostils)గా మార్చే ప్రయత్నం చేయాలి.

మధ్యస్థ సమాజం

> **ఇదేవిధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా రూపొందించాము. దైవ సందేశహరుడు మీ సమక్షంలో సాక్ష్యం ఇచ్చినట్లే, మీరున్నూ మానవుల సమక్షంలో సత్యానికి సాక్ష్యం ఇచ్చేవారు కాగలగాలని. (అల్ బకర 2: 143)**

ఈ దైవ వచనం ప్రకారం ముస్లిములు మధ్యస్థ సమాజం. ముస్లిమ్‌లు మిగతా సముదాయాలన్నింటి మధ్య న్యాయానికి ధ్వజవాహకులుగా, న్యాయం చేసేవారుగా మెలగాలి. ముస్లిములు తమ వైఖరిని సవ్యంగా ఏర్పరచుకోవాలి. ఎవరి పక్షాన కూడా అనుచిత పక్షపాతం వహించకూడదు. ప్రతి ఒక్కరి పట్లనూ సమానంగా, సత్యానికీ, న్యాయానికీ బద్ధులయి వ్యవహరించాలి. గుర్తుంచుకోవాలి, ముస్లిములు, జనావళి సమక్షంలో సత్యానికి సాక్షులు.

దైవ సందేశహరులు, ఏ సత్యాన్ని, ఏ యథార్థాన్నీ ముస్లిముల ముందు విశదపరిచారో,ఆయన అనుయాయులుగా ముస్లిములు ఆ సత్యాన్ని, ఆ యథార్థాన్ని ప్రజలకు విడమర్చి చెప్పవలసి ఉంటుంది. ప్రవక్త(శ్రీ(స) తన చివరి హజ్జ్ సందర్భంలో లక్షలాది జనుల్ని సంబోధించి, "నా పక్షంగా ఒక్క వచనం కూడా మీకు అందినట్లయితే దాన్ని ఇతరులకు చేరవేయండి" అని ఉపదేశించిన దాని ప్రకారం ముస్లిములు సత్యానికే సాక్ష్యం పలకడానికి బద్ధులు. రేపు ప్రళయంనాడు ముస్లిముల్ని సకల సముదాయాల సమక్షంలో నిలబెట్టి, "మీరు నమ్మే మీ ప్రవక్త ఆదేశాన్ని ఏ మేరకు పాలించారు?" అని ప్రశ్నించినప్పుడు సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని మరువరాదు. ముఖ్యంగా ఏ దేశంలోనయితే ముస్లిముల్ని పౌరులుగా, దైవికంగా పంపడం జరిగిందో ఆ దేశ ప్రజల సమక్షంలో దీనికి సమాధానం ఇవ్వవలసి వచ్చినప్పుడు ఏమని చెప్పుకోగలమో ఆలోచించుకోవలసిన అవసరముంది.

ఇప్పటికీ సమయం మించిపోలేదు. మంచిని ప్రేమించేవారు మన దేశంలో మెండుగా ఉన్నారు. వారిని వెతికి వారి చేరువకు పోవలసినదే తరువాయి. ఎందుకంటే ప్రవక్త మహనీయులు(స), "అజ్ఞాన కాలంలో మీకు మిత్రులయిన వారు, ఇస్లామ్‌లోనూ మీకు మిత్రులుగానే ఉంటారు" అన్నారు. సమాజంలో ముస్లిముల పాత్ర నిర్మాణాత్మకమయినదయి ఉండాలి. ముస్లిములు స్వతహాగా "మంచికి తాళం చెవిగా, చెడుకు తాళం"గా రూపొందవలసి ఉంది. ఒక ఉల్లేఖనంలో మహనీయ అబ్దుల్లా బిన్ ఉమర్(ర) దైవప్రవక్త సహచరమాన్యులను గురించి ఇలా చెప్పారు: "వారిని దైవం తన ప్రవక్తకు సహచరులుగానూ, ధర్మ సంస్థాపనకు గానూ ప్రత్యేకించి ఎన్నుకున్నాడు."

ముస్లిములు కూడా ఈ వాక్కుకు ప్రతీకగా పరివర్తించవలసి ఉంది.

సత్య సందేశ బోధన ప్రవక్తలు, దైవ సందేశహరులు నిర్వర్తించిన బాధ్యత, ఇది సహచరమాన్యులందరూ అంతిమ శ్వాస వరకు నిర్వర్తించిన కార్యక్రమం.

నేడు ప్రపంచమంతటానూ, స్వయంగా మన దేశంలోనూ దివ్య ఖుర్‌ఆన్‌ని బోధపరచుకునే దిశలో జనులు మొగ్గు చూపుతున్నారు. ప్రత్యేకంగా చివరి దైవ సందేశహరుల పవిత్ర వ్యక్తిత్వాన్ని అధ్యయనం చెయ్యాలని జనం ఉవ్విళ్ళూరుతున్నారు.

దైవప్రవక్తలు తమ సోదర దేశవాసుల్ని "నా జాతి ప్రజలారా!" అని ఆత్మీయంగా సంబోధించారు. ఈ మాటను మరువరాదు. మరో ముఖ్య విషయం : మనిషి తోటి మనిషి మాటను ఖాతరు చెయ్యడు సహజంగా! కాని అదే మాట అజ్ఞాత వాణిగా వినిపిస్తే దానికి దాసుడయి పోతాడు. ముస్లిముల మాటను కూడా సోదర దేశవాసులు పెడచెవిన పెట్టవచ్చు. కాని ముస్లిములు ఆచరణా మూర్తులయి, ఆదర్శమూర్తిని అనుసరించినట్లయితే ఆ ఆచరణే అజ్ఞాత వాణిగా పరివర్తితం అవుతుంది!! ●

# దైవారాధన



దైవారాధన అంటే అర్థం, మనమంతా మనందరినీ, సమస్త జగతిని సృష్టించిన సృష్టికర్తను, స్వామినీ, సార్వభౌముణ్ణి, నిజ ఆరాధ్య దైవంగా, యజమానిగా అంగీకరించటం. మనం ఆయన విషయంలో సర్వ స్వతంత్రులుగా వ్యవహరించకూడదు. పైగా ఆయన ఆజ్ఞలకు లోబడి, ఆయన మార్గబోధనను అనుసరిస్తూ జీవితం గడపాలి. మనం కేవలం ఆయన్ని పూజిస్తేనే సరిపోదు, ఆయనకు విధేయత చూపాలి, ఆయన దాస్యం చేయాలి. అంతేకాదు, మన సామూహిక జీవితంలోని అన్ని కోణాలలోనూ దానికి కట్టుబడి ఉండాలి. మన సామాజిక వ్యవహారాలు, మన సంస్కృతీ నాగరికతలు, మన ఆర్థిక వ్యవస్థ, మన విద్యా వ్యవస్థ, మన శాసనాలు, మన న్యాయస్థానాలు, మన ప్రభుత్వం, మన యుద్ధాలు సంధులు, మన అంతర్జాతీయ సంబంధాలు – అన్నీ దేవుడు నియమించిన నియమ నిబంధనలకు, హద్దులకు కట్టుబడి ఉండాలి. మనం మన ప్రాపంచిక వ్యవహారాలను నిర్ణయించటంలో సర్వస్వతంత్రులమై ఉండకూడదు. పైగా మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు దేవుడు గీసిన సరిహద్దు రేఖల పరిధిలోనే ఉండాలి. ఈ (దైవ) నియమ నిబంధనలు, సరిహద్దులు ఎట్టి పరిస్థితిలోనూ మన స్వేచ్ఛాధికారాల కంటే ఉన్నతమైనవి.

(తహ్‌రీక్ ఔర్ కార్‌కున్ పుస్తకం 28వ పేజీ నుండి)

# వృద్ధాప్యం కూడా ఒక వరమే

**సేకరణ : ఇమామ్‌జీ**

**ముందుగా** వృద్ధులం కాదు అదృష్టవంతులం అని భావించడం ప్రారంభించాలి, అప్పుడే, అదృష్టవంతులు అంటే మీరే అని గ్రహిస్తారు.

జపనీస్ పుస్తకం ప్రకారం, జపాన్‌లో, డాక్టర్ వాడా 60 ఏళ్లు పైబడిన వారిని 'వృద్ధులు' అని కాకుండా 'అదృష్టవంతులు' అని పిలువడాన్ని సమర్థించారు.

డాక్టర్ వాడా 60 ఏళ్ల వారికి సలహాలు కూడా ఇచ్చారు.

**"అదృష్టవంతులు" అవ్వడం ఎలాగో, ఆ రహస్యాలు ఏమిటో "35 వాక్యాలలో" ముచ్చటగా వివరించారు:**

1. ఎల్లప్పుడు కదులుతూ ఉండటం ప్రారంభించండి.
2. చిరాకుగా అనిపించినప్పుడు, లోతైన శ్వాస తీసుకుని రిలాక్స్ అవ్వండి.
3. వ్యాయామం చేయండి, తద్వారా శరీరం చురుకుగా ఉంటుంది.
4. వేసవిలో, ఎయిర్ కండీషనర్ ఆన్‌లో ఉన్నప్పుడు, ఎక్కువ నీరు త్రాగాలి.
5. మీరు నమలడం వల్ల మీ శరీరం, మెదడు మరింత శక్తివంతంగా ఉంటాయి.
6. జ్ఞాపకశక్తి తగ్గేది వయసు వల్ల కాదు, ఎక్కువ కాలం మెదడును ఉపయోగించకపోవడం వల్ల అని తెలుసుకొండి.
7. ఆరోగ్యంగా ఉండాలి అంటే ఎక్కువ మందులు వేసుకోవాల్సిన అవసరం లేదు అని గ్రహించండి.
8. రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించాల్సిన అవసరం లేదు.
9. మీరు ఇష్టపడేది మాత్రమే చేయండి.
10. ఇంట్లో ఎంత బిజీగా ఉన్నా, ప్రతి రోజూ ఇంటి నుంచి బయటకు రావడమే కాకుండా నడవడం అలవాటు చేసుకోండి.
11. మీకు కావలసినది మాత్రమే తినండి, కానీ నియంత్రణలో ఉంచండి.
12. ఎల్లప్పుడు చురుకుగా ఉంటూ, ప్రతిదీ జాగ్రత్తగా చేయండి.
13. మీకు నచ్చని వ్యక్తులతో కూడా వారి విధంగా కాక, మార్పు కోసం మంచిగా ప్రవర్తించండి.
14. ప్రియమైన వారిని జాగ్రత్తగా ప్రేమగా చూసుకోండి.
15. పూర్తిగా నయం కాని వ్యాధులతో పోరాడడం అనడం కంటే దానితో చివరి వరకు జీవించడం మంచిది అని భావించండి.
16. ప్రతిసారీ, ఆహారం తిన్న తర్వాత, తప్పనిసరిగా కొంత గోరువెచ్చని నీరు త్రాగండి.
17. మీరు నిద్రపోలేనప్పుడు, మిమ్మల్ని మీరు బలవంతం చేసుకోకండి.
18. సంతోషకరమైన పనులు చేయడం అనేది మెదడును పెంచి, ఉత్తేజపరిచే ఉత్తమ చర్య.
19. చుట్టుప్రక్కల ప్రజలతో సదా మాట్లాడుతూ ఉండండి.
20. మీకు సమీపంలో ఉన్న "ఫ్యామిలీ డాక్టర్"ని త్వరగా కనుగొని, సదా సంప్రదింపులు జరుపుతూ ఉండండి.
21. ఓపికగా సహజంగా ఉండండి, కానీ అతి వినయంగా ఉండకండి, లేదా మిమ్మల్ని మీరు ఎల్లవేళలా చక్కగా ఉండేలా బలవంతం చేసుకోకండి.
22. కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండండి, లేకపోతే పాతబడి పోయారు అని అంటారు.
23. అత్యాశతో ఉండకూడదు, ఇప్పుడు దగ్గర ఉన్నదంతా మంచిగా జీవించడానికి తప్పకుండ సరిపోతుంది అని తృప్తి చెందండి.
24. మీరు మంచం మీద నుండి లేవవలసి వచ్చినప్పుడు, వెంటనే లేచి నిలబడకండి, 2-3 నిమిషాలు వేచి ఉండండి.
25. సమస్యాత్మకమైన విషయాలు, మరింత ఆసక్తికరంగా ఉండి, శక్తి సామర్థ్యాలు పెంచడానికే అని భావించండి.
26. స్నానం చేసిన తర్వాత, బట్టలు ధరించేటప్పుడు గోడ, ఇతర వస్తువుల మద్దతు తీసుకోండి.
27. మీకు, ఇతరులకు ప్రయోజనకరమైన పనులు మాత్రమే చేయండి.
28. ప్రతిరోజు ప్రశాంతంగా జీవించడం అలవాటు చేసుకోండి.
29. న్యాయమైన మంచి కోరికలే ఆరోగ్యాయువుకు మూలం!
30. ఆశావాదిగా సమానత్వం, మానవత్వంతో జీవించండి.
31. సంతోషకరమైన వ్యక్తి ప్రజాదరణ పొందుతాడు.
32. జీవితం, జీవిత నియమాలు మీ చేతుల్లో, చేతల్లోనే ఉంటాయి అని మరవకండి.
33. ఈ వయస్సులో ప్రతిదీ ప్రశాంతంగా అంగీకరించండి!
34. నీతి, నియమాలు పాటించండి.
35. ఆదర్శంగా ఉండి ఆధ్యాత్మికతతో జీవించండి.

**అరవై ఏళ్లు దాటిన మిత్రులందరికీ అంకితం.**



# అల్లాహ్ అత్యద్భుత బహుమతి అమ్మ పాలు

**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**భూమ్యాకాశాల్లోని ఏ వస్తువూ అల్లాహ్‌కు కానరాకుండా మరుగుగా లేదు. ఆయనే (స్త్రీల) గర్భాల్లో మీ రూపురేఖల్ని తాను తలచిన విధంగా రూపొందించేవాడు. అపార శక్తి సంపన్నుడు, అద్భుత వివేచనాపరుడయిన ఆ స్వామి తప్ప (మీకు) మరో నిజ ఆరాధ్యుడు లేడు.** (ఆలె ఇమ్రాన్: 5,6)

సృష్టికర్త అల్లాహ్ ఎన్ని అద్భుతాలు చేస్తున్నాడు...! తల్లి కడుపులో శిశువును సృష్టి చేయడంతోనే సృష్టికర్త పని అయిపోలేదు... పుట్టిన బిడ్డ తాగటానికి పాలను కూడా అమ్మ స్తన్యంలో నుంచి స్రవించే గొప్ప ఏర్పాటు చేశాడు. పసిబిడ్డకు గుక్కెడు పాలు- ఈ భూమి మీద దొరకవా... ఆ ఏర్పాటు...? కాదు... కాదు... అమ్మపాలలో అమృతం ఉంటుంది గనుక పుడుతూనే బిడ్డ వాటిని తన వెంట తెచ్చుకునే ఆ అద్భుత ఏర్పాటు! ఎంత దయామయుడో కదా సృష్టికర్త...! ప్రతిదానికీ బాగా ఆలోచించి ప్రణాళికా బద్ధంగా ఈ సృష్టికార్యం జరిపిస్తున్నట్టు అనిపిస్తుంది ఇదంతా చూస్తుంటే!

సృష్టిలో ప్రతి ప్రాణికీ మూల కారణం అమ్మ. కన్నతల్లి బిడ్డని తొమ్మిది నెలలు గర్భాశయంలో పెంచి, తర్వాత జన్మనిచ్చిన ప్రేమమూర్తి. ఆ తర్వాత పాలు త్రాగించి, ఆహారం తినిపించి, ప్రేమతో పెంచుతుంది. అందుకే తల్లిని మించిన ప్రేమమూర్తి ఈ ప్రపంచంలోనే లేదంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలోకెల్లా తీయనైన పదం అమ్మ. అమ్మ ప్రేమ కంటే గొప్ప ప్రేమ, అమ్మ కంటే గొప్ప భద్రత ఎక్కడా లేదు. అమ్మ ఋణం ఎన్ని సేవలు చేసినా తీర్చుకోలేనిది.

అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు: “మేము మానవునకు తన తల్లిదండ్రుల యెడల మంచి తనంతో మెలగటం విధిగా జేశాము. అతని తల్లి అతనిని బలహీనతపై బలహీనతను సహిస్తూ (తన గర్భంలో) భరిస్తుంది. ఆ బిడ్డ చనుపాలు మాన్పించే గడువు రెండు సంవత్సరాలు. నీవు నాకు, నీ తల్లి తండ్రులకు కృతజ్ఞుడై ఉండు. నా వైపునకే నీవు మరలి రావలసి ఉన్నది”

(ఖుర్‌ఆన్ 31: 14)

మనిషికయినా, పశువుకయినా, పక్షికయినా, పురుగుకయినా, పాముకయినా- సృష్టి చరాచరాల్లో వేటికైనా అమ్మ అమ్మే.. అమ్మ ప్రేమ అందాల హరివిల్లు - ఆ తల్లి మనసు మమకారపు తేనె జల్లు. అమ్మ ఒక కమ్మని మాట, వినసొంపుగా వీనుల విందు, అనురాగానికి నిలువెత్తు ప్రతిబింబం, ప్రేమకు పట్టపు రాణి, నిస్వార్థం అనే పదానికి అర్థం అమ్మ, బంధాలకు అనుబంధం అమ్మ, కనిపెంచిన మమకారానికి అనుభూతి అమ్మ, త్యాగానికి ప్రతీక అమ్మ. అందుకే “అమ్మ అరికాళ్ళ క్రింద స్వర్గం ఉంది” అన్నారు ప్రవక్త మహనీయ ముహమ్మద్ (స).

ఇదిలా ఉంచి- ఒక్కసారి పాలిచ్చే పశువు గురించి, ఆ పశువును పుట్టించిన ప్రభువు గురించి ఆలోచించండి! పాలిచ్చే పశువులు తినే గడ్డి, ఆకులు తదితర వస్తువులు వాటి కడుపులోకి పోయి రక్తం, పేడ, మూత్రం, పాలుగా మారతాయి. రక్తం నరాలలోకి వెళ్ళగా, పేడ, మూత్రం వంటి వ్యర్థాలు బయటికి

విసర్జించబడతాయి. వాటి మధ్యలో నుంచే తయారైన పాలు పొదుగులలోకి వెళతాయి. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆ పాలలో ఒక్క బొట్టు రక్తంగానీ, ఒక చుక్క వ్యర్థ పదార్థంగానీ కలవదు. పాలు ఎంతో స్వచ్ఛంగా, తెల్లగా ఉంటా యి. కమ్మగా, రుచికరంగా ఉంటాయి. శరీరానికి శక్తినిస్తాయి. ఆకలిని తీరుస్తాయి. మనసుకు, మస్తిష్కానికి తృప్తినీ, హాయిని ఇస్తాయి. ఇదే విషయాన్ని విశదపరుస్తూ సర్వోన్నతుడయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "నిశ్చయంగా మీ కోసం పశు వులలో గొప్ప గుణపాఠం ఉంది. వాటి కడుపులో ఉన్న పేడకు-రక్తానికి మధ్యలో నుంచి స్వచ్ఛమైన పాలు మీకు త్రాగిస్తున్నాము. త్రాగేవారికి అది కమ్మగా ఉంటుంది". (అన్నహ్ల్ : 66)

## అల్లాహ్ తొలి వరం అమ్మ కమ్మనైన క్షీరం

అమ్మ పాలు .. సృష్టి అద్భుతాల్లోని మహా అద్భుత క్షీర సాగరం. దానికి సాటి, మేటి, పోటీ అనేదే లేదు. అమ్మ పాలకు మించిన అమృతం ఈ జగాన మరొకటి లేదు. నవమాసాలు గర్భంలో ఉండి అందుకొన్న తొలి వరం కమ్మనైన అమ్మ క్షీరం. తల్లిపాల వలన కలిగే లాభాల జాబితాలో ప్రతీ రోజూ కొత్త విషయాలు చేరుతూనే ఉన్నాయి. ప్రత్యేకంగా ఉదర కోశ (రెస్పిరేటరీ), జీర్ణ వ్యవస్థలకు సంబంధించిన ఇన్‌ఫెక్షన్ల నుండి పసిపాపలను తల్లిపాలు రక్షిస్తాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఇది ఎలా అంటే, తల్లిపాలలోని యాంటీ బాడీస్ ప్రత్యక్షంగా ఇన్‌ఫెక్షన్లతో పోరాడతాయి.

ఇన్‌ఫెక్షన్‌ని ఎదుర్కొనే తల్లిపాలలోని ఇతర లక్షణాలు మేలు చేసే బాక్టీరియా (నార్మల్ ఫ్లోరా) ఉండటానికి అనువైన వాతా వరణాన్ని ఏర్పరుస్తాయి. ఆ విధంగా హానికలిగించే పరాన్న జీవులు, వైరస్‌లు, బాక్టీరియాలకు అడ్డుగా నిలుస్తాయి. అంతే కాకుండా నిరూపితమైన మరో విషయం ఏమిటంటే, తల్లి పాలలోని అంశాలు అంటు వ్యాధులకు వ్యతిరేకంగా ఇమ్యూన్ సిస్టమ్‌ని ఏర్పరచడమే కాకుండా దానిని సవ్యంగా పని చేసేలా చేస్తాయి.

తల్లిపాలు అల్లాహ్ కృపచే ప్రత్యేకంగా తయారు చేయబడ్డాయి కనుక, పసిపిల్లలకు ఇది చాలా సులభంగా జీర్ణమయ్యే ఆహారం. తల్లి పాలలో పోషక విలువలు మెండుగా ఉండటమే కాకుండా, బేబీ అతి సున్నితమైన జీర్ణవ్యవస్థచే అవి సులభంగా జీర్ణం కాబడతాయి. ఆ విధంగా వాటిని జీర్ణం చేసుకోవడానికి బేబీకి తక్కువ శక్తిసరిపోవడం వలన, మిగిలిన శక్తి శరీరం ఇతర విధులే, పెరుగుదల, అవయాల అభివృద్ధి కొరకు ఉపయోగపడుతుంది.

కొంత మంది పిల్లలు నెలలు నిండకుండానే పుడతారు. అలాంటి పిల్లలను ప్రసవించిన తల్లుల పాలలో ఆ పిల్లల అవసరానికి సరిపోయేలా ఎక్కువ మోతాదులో కొవ్వు, ప్రొటీన్, సోడియం, క్లోరైడ్, ఐరన్ ఉంటాయి. ఇలాంటి పిల్లలలో 'కళ్ళ'కు సంబంధించిన విధులు చాలా బాగా అభివృద్ధి చెందేది తల్లిపాల వల్లనేనని తెలుసుకున్నారు. అంతే కాకుండా అటువంటి పిల్లలు ఇంటెలిజెన్స్ పరీక్షలలో బాగా రాణించారు. తల్లిపాల వలన ఇంకా చాలా ఉపయోగాలున్నాయి. పుట్టిన బిడ్డ అభివృద్ధికి సంబంధిం చిన వాటిలో అతి ముఖ్యమైనది తల్లి పాలు. ఇది వాస్తవం. ఎందుకంటే ఇందులో ఒమేగా-3 ఆయిల్ అల్ఫాలైనోలీక్ యాసిడ్స్ ఉంటాయి. ఇది మెదడుకు, రెటీనాకు చాలా ముఖ్యమైన మిశ్రమ పదార్థమే కాకుండా, కొత్తగా పుట్టిన పిల్లల దృష్ట్యా దీనికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఒమేగా-3కి సహజమైన, పరిపూర్ణమైన స్టోర్ తల్లిపాలు. అంతే కాకుండా తల్లిపాల వలన దీర్ఘకాలిక ప్రయోజ నాలున్నాయని, బ్లడ్ ప్రెషర్‌పై మంచి ప్రభావాన్ని కలిగి ఉండి, గుండెపోటు సమస్యను తగ్గిస్తుందని బ్రిస్టల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు తెలియజేశారు.

మెడికల్ జర్నల్ 'సర్క్యులేషన్'లో ప్రచురించిన పరిశోధనా ఫలితా లను బట్టి తల్లి పాల వలన పెరిగే బిడ్డలో గుండె సంబంధిత వ్యాధులు రావడం తక్కువని తెలుస్తుంది.తల్లి పాలలో పోలీ అనే సాట్యురేటెడ్ ఫేటీ యాసిడ్ల పొడవాటి చైన్ ఉండటం వలన, అది ఆర్టెరీస్ గట్టి పడకుండా నిరోధిస్తుంది. తల్లి అమెరికాలోని చిన్న పిల్లల హాస్పిటల్ మెడికల్ సెంటర్ టీమ్‌కి నాయకత్వం వహించిన డా.లిసా మార్టిన్ ప్రొటీన్ హార్మోన్ అధిక మోతాదులో తల్లిపాలలో ఉన్నట్లు కనుగొన్నారు. రక్తంలో అధిక మోతాదులో ఉంటే హార్ట్ ఎటాక్ సమస్య తగ్గుతుంది. హార్ట్ ఎటాక్‌కు ఎక్కువగా కారణమయ్యే స్థూలకాయం కలవారిలో తక్కువ స్థాయిలో ఉంటుంది.

ఈ హార్మోన్ వలన స్థూలకాయ సమస్య తల్లి పాలతో పెరిగిన పిల్లలలో తక్కువగా ఉంటుందని తెలుసుకున్నారు. లెప్టిన్ అనే మరో హార్మోన్‌ను కూడా తల్లి పాలలో కనుగొన్నారు.

## పసి పిల్లలకు పోషకాలున్న ఫ్రెష్ ఫుడ్ అమ్మ పాలు

తల్లిపాలకు సంబంధించిన నిజాలు పైన చెప్పిన వాటితో పూర్తయి పోలేదు. బిడ్డ పెరుగుతున్నప్పుడు, ఆ పెరిగే దశలను బట్టి, ఆ దశలకు సరిపోయే ఆహారం అవసరమవుతుంది. దానికి తగ్గట్టుగా పాలలోని పోషక పదార్థాలు ఈ ప్రత్యేక అవసరాలకు సరిపోయే విధంగా మారుతూ ఉండాలి. ఆ విధంగానే బిడ్డ ఎదుగుదలను బట్టి తల్లి పాలలో ఉండే పదార్థాలు మారుతూ ఉంటాయి.

తల్లి పాలు అన్ని సమయాలలో సరియైన ఉష్ణోగ్రత (వేడి)లో లభ్యమౌతాయి. మెదడు అభివృద్ధిలో ఇది కీలక పాత్ర వహిస్తుంది.

'పాలు' అని పిలువబడుతున్నప్పటికీ, ఈ అద్భుత మిశ్రమ పదార్థంలో ఎక్కువ శాతం నీరే ఉంటుంది. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే ఆహారంతోపాటు, పసి పిల్లలకి నీటి రూపంలో ద్రవం కూడా కావాలి. తల్లిపాలకంటే పరిశుభ్రమైన నీరు గాని, ఆహారపదార్థాలు గాని తయారుకాలేదు. తల్లిపాలలోని 90 శాతం నీరు పరిశుభ్రమైన వాతావరణంలో బిడ్డ అవసరాన్ని తీరుస్తుంది.

## కొలొస్ట్రమ్ (ముర్రు పాలు)

బ్రెస్ట్ ఫీడింగ్ విషయంలో ఇప్పటికీ చాలా మందిలో తగినంత అవగాహన ఉండడం లేదు. కొన్ని ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సాధారణంగా అమ్మ పాలు కాకుండా పిల్లలకు మనం పెట్టె ఆవు, గేదె పాలల్లోగాని, డబ్బా పాలల్లోగాని శిశువుకి కావాల్సినంత IQ (Intelligence quotient), EQ (Emotional quotient) ఉండదు. ఒక్క అమ్మ పాలలోనే అది సంపూర్ణంగా ఉంటుంది. ఇతర పిల్లల కంటే తల్లిపాలు త్రాగిన బిడ్డలోనే జ్ఞానాభివృద్ధి ఎక్కువగా ఉంటుందని శాస్త్రీయ పరిశోధనలు తెలియజేస్తున్నాయి. జేమ్స్ డబ్ల్యూ ఆండర్సన్ (కెంటకీ యూనివర్శిటీ ఎక్స్‌పర్ట్) తల్లిపాలు త్రాగిన పిల్లలకు, కృత్రిమ ఆహారాన్ని తీసుకున్న పిల్లలకు మధ్య తులనాత్మక అధ్యయనం చేశారు. తల్లిపాలు త్రాగి పెరిగిన పిల్లలలో ఐ.క్యూ 5 పాయింట్లు ఎక్కువగా ఉందని తెలుసుకున్నారు. 6 నెలల వరకూ తల్లిపాలు త్రాగిన పిల్లలకు ఇంటెలిజెన్స్‌కు ప్రయోజనం కలుగుతుంది.

## శిశువుకి మొదటి టీకా తల్లిపాలు

తల్లిపాలు శిశువు ఎదుగుదలకి అవసరమైన పౌష్టికాహారం సమపాళ్ళలో అందిస్తుంది. ఇది వైరస్‌లు, బ్యాక్టీరియా నుండి శిశువులను రక్షించేందుకు సహాయపడే యాంటీబాడీలు కలిగి ఉంటుంది. చెవి ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, విరేచనాలు వంటి అనారోగ్యాలు తగ్గిస్తుంది. శిశువు ఇమ్యూన్ సిస్టమ్ ఇంకా అభివృద్ధి చెందుతున్న ప్రాథమిక నెలలలో ఈ సహజ రక్షణ చాలా ముఖ్యం. అలాగే, తల్లిపాలతో పోషణ పొందిన పిల్లలలో భవిష్యత్తులో మాంద్యంలో, షుగర్ వ్యాధి, కొంతమంది చిన్నపిల్లల క్యాన్సర్లు వంటి దీర్ఘకాలిక పరిస్థితులు తగ్గిస్తాయి. రొమ్ము పాలించడం తల్లి, శిశువు మధ్య ఒక ప్రత్యేక భావోద్వేగ సంబంధాన్ని పెంచుతుంది. ఇది భద్రత, భావోద్వేగ అనుభూతిని పెంపొందిస్తుంది. ఇది పిల్లల మానసిక అభివృద్ధికి ముఖ్యం, దీర్ఘకాలంలో సానుకూల ప్రభావాలను కలిగి ఉంటుంది. సాధారణంగా ఫార్ములా ఫీడ్‌ల కంటే మెరుగైన రోగనిరోధక శక్తి ఉంటుంది. తల్లిపాలు తాగే పిల్లలకు ఆస్తమా, తామర, అటోపిక్ చర్మ సంబధిత వంటి అలర్జీలు వచ్చే ప్రమాదం తక్కువ.

## కరుణామయుని కరుణానుగ్రహం కన్నతల్లి కమ్మనైన క్షీరం

తల్లిపాల మరొక అద్భుత అంశమేమిటంటే, రెండు సంవత్సరాల పాటు తల్లి పాలు త్రాగితే అది బిడ్డకు చాలా ప్రయోజనకారి అవుతుంది. ఈ విషయం ఈ మధ్య కాలంలోనే సైన్స్ ద్వారా కనుగొనబడింది. అయితే ఈ విషయాన్ని అల్లాహ్ 1432 సంవత్సరాల క్రితమే ఖుర్‌ఆన్ వాక్యం ద్వారా తెలియజేశాడు:

“తల్లులు తమ బిడ్డలకు పూర్తిగా రెండు సంవత్సరాలు పాలు పట్టాలి”.

ఇదే విధంగా, బిడ్డ అవసరాలకి అన్ని విధాల సరిపోయే సరియైన పోషకాలుండే పాలను, ఆ పాల ఉత్పత్తిని తల్లి నిర్ణయించ లేదు. పాలలో వివిధ పోషక పదార్థాల స్థాయిని కూడా తల్లి నిర్ణయించలేదు. ఇది సర్వ శక్తిమంతుడైన అల్లాహ్‌కే తెలుసు. ప్రతీ జీవి అవసరాలు, ప్రతీ జీవిపై చూప వలసిన కరుణ గురించి ఆయనకే తెలుసు. కరుణామయుల్లోకెల్లా మహా కరుణా మయుడు, సంరక్షకుల్లోకెల్లా అత్యద్భుత సంరక్షకుడు అల్లాహ్. గనుకనే ఆయన తల్లి శరీరంలో పాలను సృష్టించాడు. కాబట్టి ఏదో అనుకోకుండా తయారు కాలేదు ఇది. ఈ సృష్టినంతటినీ ఓ పద్ధతిలో సృష్టించిన సృష్టికర్త ఖచ్చితంగా ఉన్నాడు. ఆయన ఒక్కే ఒక్కడు అనడానికి గొప్ప తార్కాణం.

## అపోహలను మానండి అమ్మ పాలను అందించండి

తల్లిపాల గురించి సమాజంలో కొన్ని అపోహలు ఉన్నాయి. వీటి

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

వలన కొంత మంది శిశువులు తల్లి పాలకు దూరం అవుతున్నారు. అటువంటి తల్లులకు ఈ సందర్భంగా అవగాహన చెయ్యవలసిన అవసరం ఉంది. కొంత మంది పిల్లలు పాలు త్రాగిన వెంటనే వాంతి చేస్తారు. తాగేటప్పుడు నోటితో కొంత గాలిని పీల్చడం వలన ఇలా జరుగుతుంది. ఇది ప్రమాదం కాదు. దీనిని వైద్య భాషలో పోసెట్టింగ్ అంటారు. తల్లిపాలు పెట్టిన వెంటనే నేల లేదా మంచంపై పడుకోబెట్టకుండా, భుజంపై వేసుకొని కొంత సేపు ఉంచాలి. ఎక్కువగా కదల్చరాదు. ఎక్కువ వేడి ఉన్నప్పుడు బిడ్డకు అదనంగా నీరు అవసరం లేదు. బిడ్డకు అవసరమైన నీరు తల్లిపాలలో ఉంటాయి. శిశువుకు విరేచనాలు అయితే కొంతమంది తల్లులు పాలు పట్టరు. డాక్టరు సలహా మేరకు పట్టించడం ఆపాలే తప్ప, సొంతంగా ఆపనవసరం లేదు. తల్లి గర్భవతిగా ఉన్నా కూడా బిడ్డకు పాలివ్వవచ్చు. కొన్ని పరిస్థితులలో ఒకటి రెండు రోజులు బిడ్డకి అందించక పోయినా తరువాత వెంటనే తల్లిపాలు ఇవ్వాలి. పాలిచ్చే తల్లి అవసరం మేరకు పండ్లు తీసుకోవాలే తప్ప ఎక్కువ పండ్లు తల్లి తీసుకోనవసరం లేదు. మరో పెద్ద అపోహ ఏంటంటే సిజేరియన్ అయిన వెంటనే తల్లి లేవకూడదని పాలు తాగించరు. అలాకాక తల్లి పాలు ఇవ్వగలిగే స్థితిలో ఉంటే డాక్టర్ సూచన మేరకు నర్సుల సహాయంతో బిడ్డకు పాలు ఇవ్వాలి. శిశువు పుట్టిన తరువాత తల్లి నుండి వచ్చే పాలు సరిపోవని బయట పాలు అందిస్తారు, అలా చేయకుండా తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి.

## అమ్మతనానికి మించిన అందం ఉందా?

మన దేశంలో కొంత మంది తల్లులు బిడ్డకు పాలు పెట్టడం వలన తమ అందం తగ్గిపోతుందని పాలివ్వరు. అమ్మతనానికి మించిన అందం ఈ ప్రపంచంలో ఉందా? బిడ్డకు బయట నుండి డబ్బా పాలు అందిస్తారు. ఇది చాలా తప్పు. ప్రకృతి ప్రసాదించిన గాలినే పీల్చుతాం. ప్రకృతి అందించిన నీటినే త్రాగుతాం. వీటికి ప్రత్యామ్నాయంగా ఇంకేమైనా తీసుకోగలమా? అలానే తల్లి పాలకు కూడా ఇంకో ప్రత్యామ్నాయం లేదు. విదేశాల నుండి తీసుకొచ్చిన పాల పొడులు కూడా అమ్మ పాలకు మించి పోవు. తల్లులందరూ బాగా ఆలోచించాలి. పిల్లలకు పెద్దయిన తరువాత ఆస్తులు, అంతస్తులు, డబ్బు ఇవ్వాలనుకుంటారు. కానీ వాటి కంటే పిల్లలకు ఇచ్చే మొదటి ఆస్తి తల్లిపాలనే విషయం గుర్తెరగాలి. పాలివ్వడం వలన అందం ఏం తరగదు. ఇంకా పెరుగుతుంది.

## బిడ్డకు పాలిస్తే తల్లికే లాభం

బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి కూడా లాభాలున్నాయి. ప్రసవంలో తల్లి బరువు ఎక్కువ పెరుగుతుంది. పాలివ్వడం వలన బరువు తగ్గుతారు. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, రక్తపోటు, టైప్ 2 మధుమేహం వంటి రోగాలు భవిషత్తులో రాకుండా అడ్డుకుంటాయి. పిల్లలు పుట్టిన తర్వాత తమ శిశువులకు పాలిచ్చే తల్లులు ఎక్కువగా ఉండే దేశం క్రొయేషియా. ఇక్కడ 98 శాతం మంది తల్లులు తమ బిడ్డలకు పాలిస్తున్నారు. ఇంకా రువాండా, చిలీ, బురుండి వంటి దేశాలలో ఉండే తమ పిల్లలకు పాలిచ్చే తల్లులు 80 శాతం కంటే ఎక్కువ మంది ఉన్నారు. కానీ కొన్ని పరిస్థితులలో అనగా ఉద్యోగరీత్యా, బయట పనులు చేయడం వలన తమ శిశువుకు పాలు అందివ్వలేరు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారికి ప్రసవానంతర సెలవులు ఇస్తున్నారు. అలానే ప్రైవేటు రంగంలో కూడా కనీసం ఆరు మాసాలు వేతనంతో కూడిన సెలవివ్వాలి. పాలిచ్చే అమ్మ పాలం పనులకు కూలీ పనులకు, ఆ ఆరు మాసాలు వెళ్లకుండా ఇంటిలోని యజమానులు, కుటుంబ సభ్యులు సహకరించాలి.

## జర పైలం తల్లో!

బిడ్డకు తల్లి స్తన్యం ఇవ్వటం అన్నది ఎంత సహజ విషయమే అయినా... అందులో కొంత అజ్ఞానం, అమాయకత్వం కూడా కొంతమంది విషయంలో ఉందని కొన్ని దశాబ్దాల ముందే కాదు నేటి తల్లుల గురించి తెలుసుకుంటే అర్థమవుతుంది. తల్లులు బిడ్డను పక్కలో పడుకోబెట్టి పాలు ఇచ్చేవాళ్ళు... ఇస్తున్నారు. బిడ్డ పాలు తాగుతుండగనే తల్లులు నిద్రపోయే వాళ్ళు.. పోతున్నారు కూడా! దానివల్ల పాల ధారల వేగానికి పిల్లలు ఉక్కిరిబిక్కిరై శిశు మరణాలు కూడా సంభవించేవి... నేటికీ సంభవిస్తున్నాయి. ఇప్పుడు డాక్టర్లు 'తల్లులు కూర్చుని పిల్లలకు పాలు పట్టాలని ఆ వెంటనే భుజాన ఎత్తుకుని వెన్ను చరచాలని... త్రేన్పు వచ్చేదాకా అలా చేయాలనీ చెబుతున్నారు. ఈ విషయం అప్పటి, ఇప్పటి చాలా మంది తల్లులకు తెలియదు. కాన్పు అయిన మొదటిరోజు తల్లి స్తన్యం నుంచి స్రవించే ముర్రుపాలలో పిల్లలకు రోగనిరోధక శక్తిని అందించే గుణం, ఇన్‌ఫెక్షన్స్ నుంచి, చెడు బ్యాక్టీరియా నుంచి వైరస్ నుంచి రక్షించే శక్తి ఉంటుందని గైనకాలజిస్టులు, పిడియాట్రిషియన్లు చెబుతున్నారు. కానీ గతంలో ఆడవాళ్ళు 'అవి మురికిపాలని' పిండి పారేసేవాళ్ళే గానీ పిల్లలకు తాగించేవాళ్ళు కాదు. దానివల్ల... ఆ అజ్ఞానం వల్ల... పిల్లలకు ఎంతో నష్టం జరిగిపోయింది. ఇక మీదట జరగకుండా జాగ్రత్త పడాలి!!

కథ



# అత్యాశ

- షహనాజ్ బేగం, అనంతపురం

నా మిత్రుడయిన రవూఫ్‌ను చూస్తుంటే, అతను పడ్తున్న కష్టాన్ని చూస్తుంటే ఒక్కోసారి చాలా కోపం వస్తోంది. మరోప్రక్క ఆందోళన కూడా కలుగుతోంది.

ప్రస్తుతానికి అతను మంచి స్థితిమంతుడే. అతనికి ఏ లోటు లేదు. మంచి జీతం కలిగిన ఉద్యోగం చేస్తున్నాడు.

అష్టకష్టాలు పడి స్వంత ఇంటిని కూడా నిర్మించుకున్నాడు. కానీ అతనిలో తృప్తి అనేది ఏ కోశానా లేదు. ఎప్పుడు చూసినా ఆస్తులను పెంచుకోవాలనే యావ. అహర్నిశలు అదే ధ్యాసలో ఉంటాడు. ఆ దిశగా కష్టపడ్తుంటాడు. అతనికెలాంటి చెడు అలవాట్లు లేవు.

అతనికి ఉన్నది ఇద్దరు పిల్లలు. వారి కోసం ఆస్తులను పెంచాలని, వారిని సంపన్నులుగా చెయ్యాలని ఎప్పుడూ ఆరాట పడ్తుండేవాడు.

ఆ ప్రయత్నంలో భాగంగా బ్యాంకుల ద్వారా లోన్లు తీసుకోవటమే కాక పలు చోట్ల అప్పులు చేసి భూములను, ఇళ్ళను కొన్నాడు. బ్యాంక్ లోన్ తీసుకుని కారు కూడా కొన్నాడు. నిద్రాహారాలు మాని కష్టపడ్తుండేవాడు. అది అతనికి ఒక జాడ్యంలా పట్టుకుంది.

ఇంకేముంది. తడిసి మోపడయింది పరిస్థితి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు తన కంటే సంపన్నులను చూసి తను కూడా వారిలాగే గొప్ప సంపన్నుడిలా వెలిగిపోవాలనే ఆశతో రాత్రింబవళ్లు అదే ధ్యాసలో పడిపోయి తన ఆరోగ్యాన్ని సైతం అలక్ష్యం చేశాడు.

దానికితోడు కొన్నాళ్లకి అటు బ్యాంకు వారి నుండి ఈఎంఐలు కట్టలేదని, ఇటు అప్పుల వాళ్ళ నుంచి అప్పు తీర్చమని ఒత్తిళ్లు ఎక్కువైపోయాయి. చాలా టెన్షన్‌లో పడిపోయాడు. అతనికి రాత్రిళ్ళు నిద్ర కరువైంది. ఆహారం కూడా సహించడంలేదు.

అప్పటికీ నేను ఒక స్నేహితుడిగా హితబోధనలు చేశాను. "నీకెందుకింత తాపత్రయం. నీ పిల్లలను బాగా చదివించు. అదే వారికి పెద్ద ఆస్తిని ఇచ్చినవాడవుతావు. వాళ్ళు చదివిన చదువే వారికి జీవితంలో ఓ దిశా నిర్దేశాన్ని సూచిస్తుంది. పిల్లలకు జీవితపు విలువలు తెలియజెయ్యాలి తప్ప ఆస్తులు కాదు. మరీ అత్యాశ మంచిది కాదు. ఆ దైవం అనుగ్రహం కలగదు" అన్నాను. కానీ అతను అది విని "తన పిల్లల భవిష్యత్తు గురించి ప్లాన్ చేస్తున్నాన"ని చెప్పాడు.

పిల్లల భవిష్యత్తు గురించి ప్లాన్ చెయ్యటం మంచిదే, అది బాధ్యత కూడా. కాని దాని గురించి విపరీతంగా ఆలోచిస్తూ శక్తికి మించిన శ్రమ పడటం, ఆందోళన చెందటం, కంగారు పడటం మంచిది కాదు... అంటూ సలహా ఇచ్చాను.

అలా కొన్నాళ్ళు గడిచిపోయాయి. చివరికి నేను భయపడినంత పనైంది.

తాను చేసిన అప్పుల భారాన్ని, ఆ టెన్షన్‌లకు అతని గుండె తట్టుకోలేకపోయింది. గుండె నొప్పి అంటూ ఆస్పత్రిలో చేరిన అతను తిరిగి ప్రాణాలతో ఇల్లు చేరలేదు.

అతని కలలు చెదిరిపోయాయి. అతని ప్రణాళికలు కుప్పకూలిపోయాయి. కొన్ని అసంపూర్తిగా మిగిలిపోయాయి. చివరికి ఆ ఇంట్లో అతని భార్యాపిల్లలు మిగిలిపోయారు.

కొన్ని ఆస్తులను అమ్మి అప్పులు తీర్చటం జరిగింది. తరువాత వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోయాయి.

అతని జ్ఞాపకాలు మరుగున పడిపోయాయి. ఈ ప్రపంచం ఎవరి కోసమూ ఆగదు. అది అలా ముందుకు సాగిపోతూనే ఉంటుంది.

తరువాత నాకు తెలిసిన సమాచారం ఏమిటంటే, అతని భార్య పిల్లలను తన తల్లిదండ్రుల దగ్గర వదిలేసి తను రెండో పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయిందట.

ప్రస్తుతం ఆ పిల్లలు ఎక్కడో దూర ప్రాంతాల్లో ఉన్న హాస్టల్‌లో వుండి చదువుకుంటున్నారట. జీవితం అంటే ఇదేనేమో?!

ఇదంతా విన్న తరువాత నా మనస్సు కకావికలమైపోయింది. బాధాతప్త హృదయంతో కూర్చుండిపోయాను.

దీని కోసమా తన మిత్రుడు రాత్రింబవళ్ళు అహర్నిశలు తన కుటుంబం కోసం అంటూ ఆస్తులు పెంచుకోవాలని హైరానా పడ్తూ శ్రమించాడు!

అతను జీవితంలో సుఖపడిందీ లేదు.

అందుకే అంటారు, దేనికయినా ఒక హద్దు పద్దు, ఒక పరిమితి ఉండాలని.

జీవితంలో తృప్తి గానూ, ఆ దైవానికి కృతజ్ఞతలను తెలుపుకుంటూ జీవించాలి. ❖

# ఇస్లాంపై డాకిన్స్ అపార్థాలు - వాస్తవాలు

- ముహమ్మద్ షరీఫ్

**నూతన** నాస్తికత్వ ధ్వజవాహకుల్లో ఒకడైన రిచర్డ్ డాకిన్స్ రాసిన The God delusion పుస్తకంలో దైవత్వాన్ని తిరస్కరిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశాడు.

అయితే దీనిలో అబ్రహమిక్ మతాలైన జుడాయిజం క్రిస్టియానిటి, ఇస్లాంలను ఒకే గాటన కట్టి వ్యాఖ్యానించాడు. బైబిల్‌పై లోతుగా వ్యాఖ్యానించిన ఆయన దానిలోని అన్ని విషయాలను ఇస్లాంకి ఆపాదించడం జరిగింది.

ఇది సరైన విధానం కాదు. అబ్రహమిక్ మతాలైనప్పటికీ వీటి మధ్య మౌలిక మైన తేడాలున్నాయి.

కానీ వీటినన్నింటినీ ప్రక్కనపెట్టి ఆయన సాధారణీకరించడం అంటే తప్పుదోవ పట్టించినట్లే.

మతాలన్నింటిని, అతీంద్రియ విశ్వాసాలను ఆయన వ్యతిరేకించ డాన్ని అర్థం చేసుకోవచ్చు కానీ ఇతర మతాల్లోని లోపాలను ఇస్లాంకి ఆపాదించడం సరైన చర్య కాదు.

### మతాలు మానవ వ్యతిరేకమైనవి (Anti human) :

ఈయన మొదటి అభ్యంతరం మతాలన్నీ మానవ వ్యతిరేకమైన వన్నది. దీనిని పరిశీలించడం ముఖ్యం.

ఇతర మతాల్లో మానవ హక్కుల ప్రస్తావన ఉందా? లేదా? అనేది విస్తృతమైన చర్చను కోరుతుంది కనుక ఈ చర్చను ఇస్లాంకు మాత్రమే పరిమితం చేసి మాట్లాడదాం.

ఇస్లాం మానవ వ్యతిరేక ధర్మం అన్నది కేవలం అపోహమాత్రమే. ఇక్కడ కూడా ఈ నూతన నాస్తికవాద యుగకర్తలు ఇస్లామేతర ధర్మాలలోని అంశాలను ఇస్లాంకి ఆపాదించి సాధారణీకరించే ప్రయత్నం చేస్తున్నారు.

నిజానికి ఈవిషయం శాస్త్రీయ పరిశోధనలను చర్చి అడ్డుకున్న సందర్భం దృష్ట్యా అర్థం చేసుకోవాలి.

యూరోప్‌లో చర్చి రాజ్యంపై పెత్తనం చెలాయిస్తున్న తరుణంలో సైన్స్ పరిశోధనలను చర్చి తిరస్కరించింది. అలాంటి పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలను శిక్షించడం ప్రారంభించింది. ఆ సందర్భంలో చర్చి బ్రూనో, గెలీలియో శాస్త్రవేత్తలపై చేసిన అమానవీయ దాడుల నేపథ్యంలో మతం సంకుచితమని, శాస్త్రవేత్తలను అమానవీయంగా చంపడమే మతం లక్ష్యమనీ సాధారణీకరించ డం వలన డాకిన్స్ తన రచనల్లో ఇస్లాంకు కూడా అమాయ వీనతను అంటకడతారు. నిజానికి ఇస్లాం శాస్త్రీయ ప్రగతిని ఎంతమాత్రం అడ్డుకోలేదు.

మధ్యయుగంలోనే ముస్లింలు అనేక ఆవిష్కరణలు చేశారు. ఇస్లాం గురించి బెర్ట్రెండ్ రసెల్ లాంటి పాశ్చాత్య తత్వవేత్తలు ఎంతో మానవీయ ధర్మమని అభిప్రాయపడ్డారు. ముహమ్మద్(స) గొప్ప పరిపాలకుడని జార్జి బెర్నార్డ్ షా లాంటివారు పేర్కొన్నారు.


### ఇస్లాం- మానవీయత

ఇస్లాం ఎన్నో మానవీయ విలువలు కలిగిన ధర్మం.

ఇస్లాం అంటేనే శాంతి అని అర్థం. అమానవీయంగా, అన్యాయంగా మానవుడిని హత్య చేయడాన్ని ఇస్లాం వారిస్తుంది. ఇస్లాం దృష్టిలో మానవ ప్రాణం అత్యంత విలువైనది.
ఖురాన్‌లో ఇలా ఉంది : 'హత్యకు బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే.'' (సూరె మాయిదా :32)
దీనిలో చాలా స్పష్టంగా

- అన్యాయంగా మానవ ప్రాణాన్ని హతమార్చడం అత్యంత తీవ్రమైన పాపంగా పరిగణించబడుతుంది.
- మధ్యయుగంలో ఉన్న ప్రతీకార హత్యలను రూపుమాపడానికి ప్రతీకార న్యాయంలో భాగంగా హత్యకు బదులుగా హంతకుని మరణశిక్ష లేదా మృతుని సంబంధీకులు హంతకుడిని క్షమించడం దిశగా ప్రేరేపించడం ఇస్లాం మానవీయ ధర్మమని చెప్పకనే చెబుతాయి.
- కారుణ్యమూర్తి ముహమ్మద్ (స) జీవితంలో ఆయన శతృవును ఎలా క్షమించేవారో తెలుసుకోవచ్చు.
- ఆయనను ప్రాణాంతకమైన కష్టాలకు గురిచేసిన మక్కా వాసులను మక్కా విజయ దినాన ''మీపై నేడు ఏ నేరారోపణ లేదు, మీరు క్షమించబడ్డారు'' అన్నారు.
- ఇస్లామీయ చరిత్రలో కఠిన శిక్షలు అరుదుగానే అమలయ్యా యని తెలుస్తుంది. ఏదైనా ఒక దుర్మార్గాన్ని కళ్ళతో చూసినప్పటికీ సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా ముహమ్మద్ (స) వారిని శిక్షించకుండా వదలి వేసిన సందర్భాలూ కనిపిస్తాయి.
- ఇస్లాంలో దాసుల హక్కులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. తల్లిదండ్రులు, సంతానం, బంధువులు, పొరుగువారి హక్కులు ప్రస్తావిస్తూ పటిష్టమైన మానవీయ సంబంధాల సమాహారంగా ఇస్లాం నిలుస్తుంది.
- దానధర్మాలు, ఉదారత, కరుణ చూపడం లాంటి సుగుణాలకు ఇస్లాం సముచిత స్థానం కల్పించింది.

కనుక ఇస్లాంను అమానవీయ ధర్మమని నాస్తికులు వాదించడం ప్రచారం చేయడం దురుద్దేశ పూరితమైనదని ఎవరికైనా ఇట్టే అర్థమౌతుంది.




- అర్షియా, విజయవాడ

**ఈ అందమైన సృష్టి,** అందులోని ప్రకృతి దృశ్యాలు, జీవరాశులు, గగన భువనాలు, చంద్రుడి వెలుగులు, మిరుమిట్లు గొలిపే నక్షత్రాలు, సముద్రాలు, పచ్చని పంటపొలాలు, పండ్లు, ఫలాల తోటలు, రాత్రింబవళ్ల రాకపోకలు, ఎండ, వాన, చలి, ఇవన్నీ అల్లాహ్ ఉనికిని చాటిచెబుతున్నాయి. ఇవన్నీ అల్లాహ్ అస్తిత్వానికి చిహ్నాలు. ఈ సృష్టికి సృజనకారుడొకడున్నాడని సాక్ష్యమిస్తున్నాయి.
అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు
అల్ హందులిల్లాహి రబ్బిల్ ఆలమీన్
ఎన్నో నైపుణ్యాలున్న మనిషి అవసరాలు తీర్చేందుకు ఆ దైవం ఎన్నో ఏర్పాట్లు చేశాడు. మనిషి తనకు లోబడిన ఈ ప్రకృతి వనరులపై దృష్టిపెట్టి పరిశీలనగా చూస్తే అల్లాహ్‌ను స్తుతించకుండా ఉండలేడు. సృష్టికర్తకే సకల స్తోత్రాలు అని చాటి చెబుతాడు.
ప్రకృతి అంతా అల్లాహ్‌ను స్తుతిస్తున్నది..
ఆయన పరిశుద్ధతను సప్తాకాశాలూ, భూమీ, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ కొనియాడుతున్నాయి. ఆయన స్తోత్రంతో పాటు ఆయన పరిశుద్ధతను కొనియాడనటు వంటిది ఏదీ లేదు. కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు. యథార్థానికి ఆయన అత్యంత సౌమ్య మనస్కుడు, మన్నించేవాడూను.
(దివ్య ఖుర్ఆన్ 17:44)
విశ్వమంతా అల్లాహ్‌ను స్తుతిస్తున్నది. సమస్త వనరులన్నీ తమ ఉనికిని చాటుతూ అల్లాహ్ అస్తిత్వాన్ని చాటిచెబుతున్నాయి. కానీ చాలామంది అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపడంలో ఏమరుపాటులో ఉన్నారు.

### కృతజ్ఞతలు ఎందుకు తెలపాలి?

"అల్లాహ్ తీర్పు వచ్చేసింది. ఇక దానికొరకు తొందరపెట్టకండి. ఆయన పరిశుద్ధుడు. వారు చేస్తూవున్న షిర్కుకు అతీతుడు, ఉన్నతుడు. ఆయన ఈ ఆత్మను తనకు నచ్చిన తన దాసునిపై తన ఆజ్ఞతో దైవదూతల ద్వారా అవతరింపజేస్తాడు. (ఈ ఉపదేశంతో ప్రజలను) హెచ్చరించండి: "నేను తప్ప మీకు మరొక దేవుడు ఎవ్వడూ లేడు. కనుక మీరు నాకే భయపడండి." ఆయన ఆకాశాన్నీ భూమినీ సత్యం పునాదిగా సృష్టించాడు. ఈ ప్రజలు చేసే షిర్కుకు ఆయన అతీతుడు, ఉన్నతుడు.
ఆయన మానవుణ్ణి స్వల్పమైన బిందువుతో సృష్టించాడు. చూస్తూ చూస్తూ ఉండగానే అతడు ఒక బహిరంగ వివాదిగా మారిపోయాడు. ఆయన పశువులను సృష్టించాడు. వాటిలో మీ కొరకు దుస్తులూ ఉన్నాయి, ఆహారమూ ఉన్నది. ఇంకా రకరకాల ఇతర ఉపయోగాలు కూడా ఉన్నాయి. ఉదయంపూట మీరు వాటిని మేపటానికి తోలుకుని వెళ్ళేటప్పుడూ, సాయంత్రం పూట వాటిని తిరిగి తోలుకొని వచ్చేటప్పుడూ అవి మీకు రమణీయంగా కనిపిస్తాయి. ఎంతో కష్టంతో తప్ప మీరు చేరలేని ప్రదేశాలకు సయితం అవి మీ కొరకు బరువును మోసుకునిపోతాయి. యథార్థమేమిటంటే, మీ ప్రభువు ఎంతో వాత్సల్యం కలవాడు, ఎంతో కనికరించేవాడు. ఆయన గుర్రాలనూ, కంచర గాడిదలనూ, గాడిదలనూ సృష్టించాడు. మీరు వాటిపై స్వారీ చెయ్యటానికి, అవి మీ జీవితాలకు శోభను చేకూర్చటానికి. ఆయన ఇంకా చాలా వస్తువులను (మీ ప్రయోజనం కొరకు) సృష్టిస్తాడు. వాటిని గురించి మీకసలు తెలియనే తెలియదు. వక్రములైన మార్గాలు కూడా ఉన్నప్పుడు, సక్రమమైన మార్గం చూపటం అల్లాహ్ బాధ్యతే. ఆయన తలచుకుని ఉంటే మీ అందరికీ సన్మార్గం చూపి ఉండేవాడే.
ఆకాశం నుండి మీ కోసం నీళ్ళను కురిపించేవాడు ఆయనే. ఆ నీటిని మీరూ తనివితీరా త్రాగుతారు, ఆ నీటివల్ల మీ పశువులకు కూడా మేత మొలుస్తుంది. ఆయన ఆ నీటిద్వారా పొలాలను పండిస్తాడు. జైతూను, ఖర్జూరం, ద్రాక్ష ఇంకా రకరకాల ఇతర పండ్లను పండిస్తాడు. ఆలోచించే వారికి ఇందులో ఒక గొప్ప నిదర్శనం ఉంది.
ఆయన మీ మేలు కోసం రాత్రినీ, పగలునూ సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ మీకు వశపరిచాడు. నక్షత్రాలు కూడా ఆయన ఆజ్ఞ వల్లనే మీకు వశమై ఉన్నాయి. బుద్ధిని ఉపయోగించేవారికి ఇందులో చాలా సూచనలు ఉన్నాయి. ఆయన మీకోసం భూమిలో సృష్టించిన అనేక రంగు రంగుల వస్తువులలో కూడా గుణపాఠం నేర్చుకునే వారికి నిశ్చయంగా సూచన ఉంది.
సముద్రాన్ని మీ సేవ కోసం నియోగించినవాడు ఆయనే, దాని నుండి మీరు తాజా మాంసాన్ని తీసుకుని తినేటందుకు, మీరు

ధరించే ఆభరణాలను దానినుండి వెలికి తీసుకునేటందుకు. సముద్రం రొమ్మును చీలుస్తూ ఓడ పయనించటాన్ని మీరు చూస్తారు. ఇదంతా ఎందుకంటే, మీరు మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషించాలనీ, ఆయనకు కృతజ్ఞులు కావాలనీ.

(దివ్య ఖుర్‌ఆన్ 16:1-14)

ఈ మార్గంలో ఎవరో వెళ్లారన్న విషయం ఆ ప్రాంతంలో ఉన్న మనిషి పాదముద్రలు చూసి పసిగడతారు. అలాగే ఈ సృష్టిలోని ప్రకృతి వనరులన్నీ వీటి సృష్టికర్త ఒకడున్నాడని, ఆయన అత్యంత దయాముడు, కరుణామయుడు అనే విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. మనిషి అవసరాలు తీర్చేందుకు ఈ విశ్వాన్ని సృష్టించాడు దైవం. మనిషి మనుగడను కొనసాగించడానికి రాత్రింబవళ్ల విశ్వవ్యవస్థను నిర్వహిస్తున్నాడు. అందుకే ఆయన అనుగ్రహాల పట్ల హృదయపూర్వకంగా దైవానికి కృతజ్ఞతలు తెలపాలి.

"అల్లాహ్ మిమ్మల్ని మీ మాతృగర్భాల నుండి మీరు ఏమీ ఎరుగని స్థితిలో ఉండగా బయటికి తీశాడు. ఆయన మీకు చెవులు ఇచ్చాడు. కళ్ళు ఇచ్చాడు. ఆలోచించే మనస్సు ఇచ్చాడు - మీరు కృతజ్ఞులు కావాలని." (దివ్య ఖుర్‌ఆన్ 16:78)

ఈ సృష్టిలోని ఏ ప్రాణికీ ఇవ్వని ప్రత్యేకతలు మనిషికిచ్చాడు వినే, మాట్లాడే, ఆలోచించే బుద్ధి జ్ఞానాలనేవి మనిషికే సొంతం. అందుకే అల్లాహ్‌కు కృతజ్ఞుడైన దాసుడిగా జీవించాలన్నదే ఖుర్‌ఆన్ బోధన సారాంశం.

## కృతజ్ఞతలు తెలపడం వల్ల మనిషికే మేలు

ఎవడైనా కృతజ్ఞతలు తెలిపితే, అతని కృతజ్ఞతలు అతనికే లాభకరం, ఎవడైనా కృతఘ్నుతకు పాల్పడితే నిజానికి అల్లాహ్ అతీతుడు తనకు తానే స్తుతిపాత్రుడు. (దివ్య ఖుర్‌ఆన్ 31 : 12)

అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపడం వల్ల అల్లాహ్‌కు ఒరిగేదేమీ ఉండదు. కృతజ్ఞతలు తెలపకకుండా కృతఘ్నుతకు పాల్పడటం వల్ల అల్లాహ్‌కు రవ్వంత నష్టమూ చేకూరదు.

## విశ్వాసానికి చిహ్నం

స్తోత్రం అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తుంది. ఆయన భూమినీ, ఆకాశాలనూ నిర్మించాడు. వెలుగునూ చీకట్లనూ సృష్టించాడు. అయినా సత్యసందేశాన్ని స్వీకరించటానికి నిరాకరించినవారు ఇతరులను తమ ప్రభువుకు సమానులుగా పరిగణిస్తున్నారు.

(దివ్య ఖుర్‌ఆన్ 6:1)

## కళ్లు తెరిపించే ఖుర్‌ఆన్ పాఠాలు..

వారు తమపై ఉన్న ఆకాశం వైపు ఎన్నడూ చూడలేదా? మేము దానిని ఎలా నిర్మించి, అలంకరించామో? అందులో ఎలాంటి పగుళ్లూ లేవు. మేము భూమిని పరిచాము, అందులో పర్వతాలను స్థిరపరచాము. అందులో మనోహరమైన అన్ని రకాల వృక్షజాతులను మొలకెత్తించాము. (సత్యం వైపునకు) మరలే ప్రతి దాసునికి ఇవన్నీ కళ్లు తెరిపించేవీ, గుణపాఠం నేర్పేవీ అయిన విషయాలు.

(దివ్య ఖుర్‌ఆన్ 50:6-8)

తలపైకెత్తి చూస్తే కనబడే ఎత్తయిన ఆకాశం, అందులోని సూర్యచంద్ర నక్షత్రాలు, పైనుండి వర్షం కురవగానే పచ్చగా మెరిసే పంటపొలాలు, అందులో పండే ఆహార గింజలు ఇవన్నీ పరిశీలనగా చూస్తే మనో నేత్రాలు తప్పకుండా తెరుచుకుంటాయన్నది ఖుర్‌ఆన్ ఉద్బోధన.

## ఎలాంటి లోపమూ లేని గగనం

ఆయన ఒకదానిపై నొకటి ఏడు ఆకాశాలను సృజించాడు. నీవు కరుణామయుని సృష్టిలో ఎలాంటి క్రమరాహిత్యాన్నీ చూడలేవు. కావాలంటే మరొకసారి చూడు, అందులో నీకేమైనా లోపం కనిపిస్తున్నదా? మళ్లీ మళ్లీ చూడు, నీ చూపులు అలసిపోయి విఫలమై వెనుకకు తిరిగి వస్తాయి. (దివ్యఖుర్‌ఆన్ 67: 3-5)

## సస్యశ్యామలం అవుతుందిలా..

వారికి మృతభూమి ఒక సూచన. మేము దానికి ప్రాణం పోశాము. దానినుండి మీరు తినే ధాన్యం ఉత్పత్తి చేశాము. మేము దానిలో ఖర్జూరం, ద్రాక్ష తోటలను పెంచాము. దానిలో నుండి ఊటలు చిమ్మేలా చేశాము, వారు దాని ఫలాలను తినాలని. ఇదంతా వారి చేతులు సృష్టించింది కాదు కదా! అలాంటప్పుడు వారు కృతజ్ఞతలు తెలుపరా? (దివ్యఖుర్‌ఆన్ 36 : 33-35)

## సూర్యుడి వెలుగు... చంద్రుని వెన్నెల

ఆకాశంలో బురుజులను నిర్మించినవాడూ, అందులో ఒక దీపాన్ని, ఒక మెరిసే చంద్రుణ్ణి వెలిగించినవాడూ ఎంతో శుభప్రదుడు.

(దివ్య ఖుర్‌ఆన్ 25:61)

ఇక చంద్రుడు, అతడి కొరకు మేము దశలను నిర్దేశించాము. వాటిని దాటుకుంటూ వెళ్లి, చివరకు అతడు మళ్లీ ఎండిన ఖర్జూరపు కొమ్మ మాదిరిగా మారిపోతాడు. చంద్రుణ్ణి పట్టుకోవటం సూర్యుడి తరం కాదు. అదేవిధంగా రాత్రి, పగలును దాటి పోజాలదు. అవన్నీ వేర్వేరు కక్ష్యలలో తేలియాడుతూ ఉన్నాయి.

(దివ్య ఖుర్‌ఆన్ 36:38-40)

## రాత్రింబవళ్లు..

వారు విశ్రాంతి పొందటానికి మేము రాత్రిని సృష్టించాము. మేము పగటిని ప్రకాశవంతంగా చేశాము. వారి బుద్ధికి ఈ విషయాలు తట్టేవికావా? విశ్వసించే వారికి ఇందులో అనేక సూచనలు ఉండేవి. (దివ్య ఖుర్‌ఆన్ 27:86)

## వర్షాన్ని కురిపించే అల్లాహ్

ఉత్పత్తి కారకములైన గాలులను మేమే పంపుతున్నాము. ఆ తరువాత ఆకాశం నుండి నీళ్ళను వర్షింపజేస్తున్నాము. ఆ నీళ్ళను మీకు తనివితీరా త్రాగటానికి ఇస్తున్నాము. (15:22)

## వర్షం కురిస్తేనే హర్షం

అల్లాహ్‌యే గాలులను పంపేవాడు, అవి మేఘాలను లేపుతాయి, తరువాత ఆయన ఆ మేఘాలను తన ఇష్టం ప్రకారం ఆకాశంలో

మిగతా 34వ పేజీలో...




## ఆ పాఠ్య పుస్తకాల్లో రాజ్యాంగ ప్రవేశిక లేదు

ఎన్‌సిఇఆర్‌టి ఈ ఏడాది జారీ చేసిన 3, 6 తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలలో రాజ్యాంగ ప్రవేశిక కన్పించలేదు. దీంతో కేంద్రం తీరుపై విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన సబ్జెక్టులుగా భావిస్తున్న లాంగ్వేజెస్, పర్యావరణ అధ్యయనాలు (ఇవిఎస్) వంటి కొన్ని పాఠ్య పుస్తకాల నుండి రాజ్యాంగ ప్రవేశికను తొలగించారు. ఎన్‌సిఇఆర్‌టి 2005-06, 2006-07 మధ్య అన్ని తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలను ప్రచురించింది. ఎన్‌డిఎ ప్రభుత్వం 2020లో నూతన విద్యా విధానాన్ని తీసుకురావడంతో ప్రస్తుతం ఎన్‌సిఇఆర్‌టి ఆ పాఠ్య పుస్తకాలను సవరిస్తోంది. ఈ సంవత్సరం 3, 6 తరగతుల కోసం నూతన పాఠ్య పుస్తకాలను విడుదల చేసింది. ప్రవేశికను ఎందుకు తొలగించారో ఎన్‌సిఇఆర్‌టి వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ మాజీ అధ్యాపకురాలు నందితా నారాయణ్ తెలిపారు. 'బిజెపి ప్రభుత్వం ప్రవేశికను చూస్తే భయపడుతోంది. ఎందుకంటే స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి రాజ్యాంగంలోని కీలకమైన విలువలను అది చాటిచెబుతోంది. ఈ ప్రభుత్వం ఆ విలువలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. అందుకే అనేక పుస్తకాల నుండి ప్రవేశికను తొలగించింది' అని నందితా నారాయణ్ చెప్పారు.

## వక్ఫ్ బోర్డు చట్టంలో సవరణలు

వక్ఫ్‌బోర్డు అధికారాలకు కత్తెర వేయడానికి వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు 40 సవరణలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఏదైనా ఆస్తిని 'వక్ఫ్ ఆస్తి' అని నిర్ధారించే అధికారం వక్ఫ్ బోర్డ్ యాజమాన్యానికి ఇకపై ఉండదనేది వీటిలో ముఖ్యమైన సవరణ. వక్ఫ్ బోర్డు తన ఆస్తులుగా పేర్కొనే అన్నింటిని తప్పనిసరిగా తనిఖీ చేస్తారు. కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్రాల బోర్డుల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలన్న ప్రతిపాదన కూడా తాజా సవరణల్లో ఉంది. 2013లో యూపీఏ సర్కారు ఒరిజినల్ వక్ఫ్ చట్టం-1995కు సవరణలు చేయడం ద్వారా వక్ఫ్ కేంద్ర, రాష్ట్ర బోర్డులకు ఉన్న అధికారాలను బలపరిచింది. వక్ఫ్ బోర్డ్‌ల చట్టబద్ధమైన హోదా, అధికారాల్లో జోక్యం చేసుకుంటే సహించబోమని 'ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్' (ఏఐఎంపీఎల్‌బీ) పేర్కొంది. ముస్లింలకు సంబంధించి వారికి ఏమీ ఇవ్వకుండా, అన్నింటినీ లాక్కునే విధంగా మోదీ నిర్ణయాలు, చర్యలు ఉన్నాయంటూ 'ఏఐఎంపీఎల్‌బీ' ప్రతినిధి ఇల్యాస్ ఆరోపించారు.

## పొరుగు దేశంతో గుణపాఠం

పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను ఒక హెచ్చరిక లాగా తీసుకోవాలని, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు సూచించారు. విద్యావేత్త ముజీబు ర్రహ్మాన్ రాసిన 'షిక్వ-ఎ-హింద్: భారతీయ ముస్లింల రాజకీయ భవిష్యత్తు' అనే పుస్తకం ఆవిష్కరణ సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ ఈ అంశంపై స్పందించారు. 'బంగ్లాదేశ్‌లో జరుగుతున్నది ఇక్కడా జరగవచ్చు. అయితే, భౌగోళికంగా మన దేశం చాలా పెద్దది కాబట్టి.. బంగ్లాదేశ్‌లో జరిగినట్టుగా ఇక్కడ ప్రజల అసంతృప్తి ఒక్కసారిగా పెల్లుబికటం లేదు' అని పేర్కొన్నారు. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ, ఢిల్లీలో సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా దీర్ఘకాలంపాటు జరిగిన షాహీన్‌బాగ్ ఉద్యమాన్ని గుర్తు చేశారు. పార్లమెంటు నిస్తేజంగా మారినప్పుడు వీధులు చైతన్యంతో వెలుగొందుతాయన్నారు. బంగ్లాదేశ్ పరిణామాలను భారత్ ఒక గుణపాఠంలా తీసుకోవాలని.. నిరంకుశత్వం ఎక్కువ కాలంపాటు కొనసాగదని పీడీపీ అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ చెప్పారు.

## తీవ్ర నిరంకుశ పాలనకు ఫలితం

ప్రస్తుతం యావత్ ప్రపంచ దృష్టి బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభంపైనే ఉంది. బంగ్లాదేశ్ రాజకీయ పరిస్థితుల పట్ల జమాఅతె ఇస్లామీ హింద్ విచారం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని జమాఅత్ ఇస్లామీ హింద్ అమీర్ సయ్యద్ సాదతుల్లా హుస్సేనీ అక్కడి పాలకులకు విజ్ఞప్తి చేశారు. బంగ్లాదేశ్ ప్రస్తుత పరిస్థితులకు షేక్ హసీనా విపరీతమైన నిరంకుశ పాలన ఫలితమేనని ఆయన అన్నారు. ఇటీవల ఆ దేశంలో జరిగిన సాధారణ ఎన్నికలు పారదర్శకంగా జరగలేదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అంతేకాకుండా సాధారణ ఎన్నికలను బహిష్కరించాయి. దాంతో ఆ దేశ రాజకీయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం బలహీనమైపోయింది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా రాజకీయ కక్షసాధింపులకు దిగారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే గళాలను నొక్కిపెట్టారు. అంతేకాకుండా వారిని నిర్బంధించడం జరిగింది. దాంతో ప్రజాగ్రహం పెల్లుబికింది అని ఆయన వెల్లడించారు.




## హమాస్ పగ్గాలు యహ్యా చేతికి

హమాస్ రాజకీయ విభాగం అధిపతిగా యహ్యా సిన్వర్ (61) నియమితులయ్యారు. స్వతంత్ర పాలస్తీనా కోసం పోరాడుతున్న హమాస్ రాజకీయ విభాగం అధిపతి ఇస్మాయిల్ హనియా జులై 31న హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆయన వారసుడిగా యహ్యా సిన్వర్ కొనసాగనున్నారని హమాస్ ప్రకటించింది. హమాస్‌లో ప్రముఖ వ్యక్తి అయిన సిన్వర్ 2017 నుండి గాజా గ్రూప్‌లో కొనసాగుతున్నారు. గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై దాడికి పాల్పడిన హమాస్ బృందంలో సిన్వర్ కూడా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రతీకారం పేరుతో ఇజ్రాయిల్ గాజాపై అమానుష దాడులకు తెగబడుతోంది. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడిలో సుమారు 40,000 మంది పాలస్తీనియన్లు మరణించారు.

## ప్రతీకారం తప్పదు

ఇరాన్ గడ్డపై అమరుడైన హనియ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం తమ బాధ్యత అని ఈరాన్ అధ్యక్షుడు ఖుమైనీ ప్రకటించారు. ఈ పిరికిపంద, ఉగ్రవాద చర్యలకు ఇజ్రాయిల్ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యుడు ముసా అబూ మర్జూక్ కూడా ఇదే విధంగా హెచ్చరించారు. హనియ హత్యను ఖండిస్తూ ఇరాన్ అంతటా, అలాగే మధ్య ప్రాచ్యంలోని పలు నగరాల్లో పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. హనియ హత్యకు ఇజ్రాయిల్, అమెరికా రెండూ మూల్యం చెల్లించుకోక తప్పదని వందలాదిమంది నినదించారు. హనియ హత్యను ఖండించిన అంతర్జాతీయ సమాజం, తక్షణమే ఉద్రిక్తతలు సమసిపోయేలా గాజాలో కాల్పుల విరమణపై దృష్టి కేంద్రీకరించాల్సిందిగా కోరింది. టెహరాన్, బీరుట్‌ల్లో జరిగిన దాడులు చూస్తుంటే ప్రమాదకరమైన రీతిలో ఉద్రిక్తతలు పెచ్చరిల్లే ప్రమాదముందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ పేర్కొన్నారు. అత్యవసరంగా సమావేశమైన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తాజా పరిణామాలపై చర్చించింది. శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడాలని పిలుపునిచ్చింది. మనందరినీ సంక్షోభంలోకి నెట్టేందుకు ఇజ్రాయిల్‌ను అనుమతించ రాదని పాలస్తీనా డిప్యూటీ ప్రతినిధి ఫెదా నాజర్ స్పష్టం చేశారు.

## పశ్చిమ దేశాల ఖైదీలు విడుదల

పశ్చిమ దేశాలకు చెందిన 16 మంది ఖైదీలను రష్యా విడుదల చేసింది. అమెరికా, జర్మనీ, నార్వే, పోలాండ్, స్లోవేనియా దేశాల్లో ఉన్న 8 మంది రష్యా జాతీయుల్ని కూడా రిలీజ్ చేశారు. వాల్ స్ట్రీట్ జర్నల్ రిపోర్టర్ ఇవాన్ గ్రెస్‌కోవిచ్‌తో పాటు అమెరికా మెరైన్ పాల్ వీలన్, జర్మనీ దేశస్థుడు రికో క్రీగర్‌తో పాటు మరికొందర్ని రష్యా రిలీజ్ చేసింది. రష్యా రిలీజ్ చేసిన అమెరికా జాతీయులు మేరీల్యాండ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆ ఖైదీలకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ స్వాగతం పలికారు. ఖైదీల అప్పగింత ఒప్పందం ప్రకారం.. ఏడు దేశాల నుంచి 24 మంది రిలీజ్ అయ్యారు. మాస్కోలో అధ్యక్షుడు పుతిన్.. రిలీజైన ఖైదీలను కలిశారు. ఆ ఖైదీలకు ప్రభుత్వ పురస్కారాన్ని అందించనున్నట్లు ఆయన చెప్పారు.

## తక్షణమే అణ్వాయుధాలను రద్దు చేయాలి

అణ్వాయుధాలపై ఆధారపడడాన్ని ఆపాలంటూ హిరోషిమా గవర్నర్, మేయర్ ప్రపంచ నేతలకు విజ్ఞప్తి చేశారు. తక్షణమే అణ్వాయుధాల రద్దు దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఉక్రెయిన్, మధ్య ప్రాచ్యంల్లో యుద్ధాలు, దాడులు, తూర్పు ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అణు యుద్ధం ముప్పు అవకాశాలను తొలగించాలని వారు కోరారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగింపు సమయంలో 79ఏళ్ల క్రితం హిరోషిమాపై అణు దాడి సంఘటనను వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అణ్వాయుధాల రద్దు సుదూర ఆదర్శం కాదని, తక్షణమే దృష్టి సారించాల్సిన వాస్తవిక, ప్రాధాన్యత గల అంశమని పేర్కొన్నారు. హిరోషిమా మేయర్ కజుఇ మత్సుయి మాట్లాడుతూ, ఈనాడు ప్రపంచం నలుమూలలా ఏదో ఒక ప్రాంతంలో యుద్ధం, అల్లర్లు, అశాంతి కొనసాగుతూనే వున్నాయని, ఇటువంటప్పుడు అణు ముప్పు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని కిషిదా మాట్లాడుతూ అంతర్జాతీయ సమాజంలో ఈ విషయమై చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఆశ్రయం కోసం 'ఆమె' అన్వేషణ

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రస్తుతం ఆమె ఢిల్లీలో ఉన్నారు. లండన్‌లో ఆశ్రయం పొందేందుకు ఆమె చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. హసీనాకు ఆశ్రయం కల్పించేందుకు బ్రిటన్ ఆసక్తిగా లేనట్లు తెలుస్తోంది. దీంతో హసీనా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా దేశాలతో ఆశ్రయం కోసం షేక్ హసీనా సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు తమ కుటుంబసభ్యులు నివసించే అమెరికా, ఫిన్‌ల్యాండ్ దేశాలతోనూ ఆమె టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. హసీనా రాజీనామాతో పార్లమెంట్‌ను రద్దు చేసి తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రభుత్వానికి నోబెల్ గ్రహీత ముహమ్మద్ యూనుస్ అధినేతగా కొనసాగనున్నారు.

**31వ పేజీ తరువాయి...**

వ్యాపింప జేస్తాడు, వాటిని ఖండికలుగా విభజిస్తాడు, తరువాత మేఘంలో నుండి వర్షపు బిందువులు కురియటాన్ని నీవు చూస్తావు. ఆయన ఈ వర్షాన్ని తన దాసులలో తనకు ఇష్టమైన వారిపై కురిపించగానే, వారు ఆనందంతో పొంగిపోతారు.

(దివ్య ఖుర్ఆన్ 30:48)

## సాగునీరు ఒక్కటే పండ్ల రుచులు వేరు..

చూడండి! భూమిలో వేర్వేరు ప్రదేశాలు ఉన్నాయి. అవి ఒకదాని కొకటి ప్రక్కప్రక్కన ఉన్నాయి. ద్రాక్ష తోటలూ ఉన్నాయి, పంట పొలాలూ ఉన్నాయి, ఖర్జూరపు చెట్లూ ఉన్నాయి- వాటిలో కొన్ని ఒక్కొక్కటిగానూ మరికొన్ని జంటలుగానూ ఉన్నాయి- వాటన్నింటికీ ఒకే నీరు పారుతోంది. కానీ మేము కొన్నింటిని ఎక్కువ రుచికరమైనవిగా చేశాము. మరికొన్నింటిని తక్కువ రుచికర మైనవిగా చేశాము. ఈ అన్ని విషయాలలోనూ బుద్ధిని ఉపయో గించే వారికి చాలా సూచనలు ఉన్నాయి. (దివ్య ఖుర్ఆన్ 13:4)

## జీవన సామగ్రి..

మానవుడు తాను తీసుకునే ఆహారం గురించి కొంచెం ఆలోచిం చాలి. మేము పుష్కలంగా నీటిని కురిపించాము, తరువాత నేలను అద్భుతమైన రీతిలో చీల్చాము, ఆ తరువాత అందులో ధాన్యం, ద్రాక్ష, కూరగాయలు, ఆలివ్ (జైతూన్) వృక్షాలు, దట్టమైన తోటలు, ఇంకా రకరకాల పండ్లను, మేతను మీ కొరకు, మీ పశువుల కొరకు జీవన సామగ్రిగా పండించాము.

(దివ్య ఖుర్ఆన్ 80:24-30)

## పాలు.. గుణపాఠాలు..

మీకు పశువులలో కూడా ఒక గుణపాఠం ఉన్నది. వాటి గర్భంలో పేడ, రక్తానికి మధ్య ఉన్న ఒక వస్తువును మేము మీకు త్రాగిస్తాము. అంటే స్వచ్ఛమైన పాలు. అది త్రాగేవారికి ఎంతో కమ్మనిది. (దివ్య ఖుర్ఆన్ 16:66)

## తేనెటీగ..

చూడండి, మీ ప్రభువు తేనెటీగకు వహీద్వారా ఈ విషయాన్ని తెలిపాడు. కొండలలో, చెట్లమీద, తడికలపై ఎక్కించబడిన తీగెలలో నీ తెట్టెలను నిర్మించుకో, అన్ని రకాల పండ్లరసాన్ని పీల్చు, నీ ప్రభువు సుగమం చేసిన మార్గాలపై నడుస్తూ ఉండు.'' ఈ ఈగ కడుపులో నుండి రంగు రంగుల పానకం ఒకటి వెలువడు తుంది. అందులో ప్రజల కోసం వ్యాధి నివారణ శక్తి ఉన్నది. ఆలోచించే వారికి ఇందులో కూడా నిశ్చయంగా ఒక సూచన ఉంది. (దివ్య ఖుర్ఆన్ 16:68-69)

## పచ్చని పంట పొలాలు..

ఎప్పుడైనా మీరు ఇలా ఆలోచించారా? మీరు నాటే ఈ విత్తనాలతో పొలాలను మీరు పండిస్తారా లేక వాటిని పండించేవారము మేమా? మేము తలచుకుంటే ఈ పంట పొలాలను పొట్టుగా చేసి వేస్తాము. అప్పుడు మీరు, "మేము చాలా నష్టంలో పడిపోయా మని, అసలు మా అదృష్టమే కాలిపోయిందని'' రకరకాలుగా మాటలు చెప్పుకుంటారు. (దివ్యఖుర్ఆన్ 56:63-67)

## త్రాగే నీరు

ఎప్పుడైనా మీరు కళ్లు తెరచి చూశారా మీరు త్రాగే ఈ నీటిని మేఘాలనుండి మీరు కురిపించారా? లేక దానిని కురిపించే వారము మేమా? మేము తలచుకుంటే దానిని ఎంతో ఉప్పగా ఉండేలా చేయగలము. అలాంటప్పుడు మీరు కృతజ్ఞులై ఎందుకు ఉండరు? (దివ్య ఖుర్ఆన్ 56:68-70)

నీరు జీవరాశుల ప్రాణాధారం. చుక్క నీరు లేకపోతే ఈ భూమిపై ఈ జీవరాశి బ్రతికిబట్టకట్టలేదు. వర్షం కురవకపోతే, భూమిలో నుంచి వచ్చే త్రాగు నీరు ఉప్పగా ఉంటే మనిషి పరిస్థితి ఆలోచిస్తేనే భయంకరంగా ఉంటుంది.

## రేతస్సు...

మీరు విడిచే ఈ రేతస్సుతో బిడ్డను మీరు తయారు చేస్తారా లేక దానిని సృష్టించేవారము మేమా? (దివ్యఖుర్ఆన్ 56:58-59)

## మనిషి పుట్టుక దశలు..

మేము మానవుణ్ణి మట్టియొక్క సారంతో సృష్టించాము తరువాత అతనిని ఒక సురక్షితమైన స్థానంలో పడే బిందువుగా మార్చాము, ఆ తరువాత ఈ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము, ఆపైన ముద్దను కండగా చేశాము, తరువాత మాంసపుకండను ఎముకలుగా చేశాము, ఆ తరువాత ఎముకలకు మాంసాన్ని తొడిగాము, ఆపైన దానిని భిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము. కనుక అల్లాహ్ ఎంతో శుభప్రదుడు, సృజనకారులందరిలోకెల్లా ఉత్తమ సృజన కారుడు. (దివ్య ఖుర్ఆన్ 23:12-14)

## మూడు చీకటి పొరలు..

ఆయన మీ తల్లుల గర్భాలలో మూడేసి చీకటి తెరలలో మీకు ఒక రూపం తరువాత మరొక రూపాన్ని ఇస్తూపోతు న్నాడు. (ఈ కార్యాలు నిర్వహించే) ఈ దేవుడే మీ ప్రభువు, సృష్టి సామ్రాజ్యం ఆయనదే. ఆయన తప్ప మరొక దేవుడు ఎవ్వడూ లేడు. అలాంటప్పుడు మీరు ఎలా మరలింపబడుతున్నారు?

(దివ్య ఖుర్ఆన్ 39:6)

## పోయే ప్రాణాన్ని తీసుకురాగలరా?

మీరు గనక సత్యవంతులే అయితే, చనిపోయే వాడి ప్రాణం గొంతులోకి వచ్చినప్పుడు, అతడు చనిపోతున్నాడని మీరు కళ్లారా చూస్తూ ఉంటారు, ఆ సమయంలో పోయే ప్రాణాన్ని మీరు తిరిగి ఎందుకు తీసుకురాలేరు? (దివ్యఖుర్ఆన్ 56:83-86)

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**